www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -67 ఆదివారం 21 జూన్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

# ఆరోగ్యమే అభివృద్ధికి అసలైన సూచిక



**పబ్లిక్ హెల్త్ క్యాపిటల్‌గా తెలంగాణ**

**పేదలకు అండగా నిలవడమే నిజమైన వైద్యం**

**వైద్యం సామాన్యుడికి అందుబాటులో ఉండాలి**

**వ్యాధి చికిత్స కంటే నివారణెలి మిన్న**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**


**హైదరాబాద్,జూన్ 20: (ప్రజావినికిడి):**
ప్రజల ఆరోగ్యమే అత్యున్నతమైన అభివృద్ధికి అసలైన నిదర్శనమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇండియా హెల్త్ సమిట్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వైద్య రంగ నిపుణులు, ప్రముఖ వైద్యులు, హాస్పిటల్స్, ఫార్మా, బయోటెక్నాలజీ, డిజిటల్ హెల్త్ రంగానికి చెందిన ప్రతినిధులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆరోగ్యం అనేది కేవలం ఒక ప్రభుత్వానికి సంబంధించిన అంశం కాదన్నారు. ప్రతి ఒక్కరి ప్రాథమిక అవసరమని పేర్కొన్నారు. ఒక కుటుంబంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే ఆ కుటుంబం మొత్తం ఆర్థికంగా కుప్పకూలిపోతుందని, వారి జీవితాంతం దాచుకున్న పొదుపు మొత్తం **మిగతా 2లో...**

## పోక్సో కేసులో బండి భగీరథ్‌కు మధ్యంతర బెయిల్



**హైదరాబాద్:జూన్ 20: (ప్రజావినికిడి):**
పోక్సో కేసులో రిమాండ్ ఖైదీగా జైలులో ఉన్న కేంద్ర మంత్రి తనయుడు బండి భగీరథ్ కి మేడ్చల్ మల్కాజ్‌గిరి కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన శనివారం చర్లపల్లి జైలు నుంచి విడుదలయ్యారు. ఇంజినీరింగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని భగీరథ్ తరఫు న్యాయవాదులు కోర్టును ఆశ్రయించారు. విద్యా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని న్యాయవాదులు చేసిన వాదనలను పరిశీలించిన న్యాయస్థానం**మిగతా 2లో...**

# దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్



**యోగాకు గుర్తింపు తెచ్చిన ఆధ్యాత్మిక వేత్త బాబా రాందేవ్**

**ఉండవల్ల గుహల వద్ద అంతర్జాతీయ యోగా నిర్వహణ**

**బాబాతో కలసి ఆసనాలు వేసిన చంద్రబాబు**

**చంద్రబాబు విజినరీ నేత అన్న బాబా రాందేవ్**

**అమరావతి,జూన్ 20: (ప్రజావినికిడి):**
: దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్ మారనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాజధాని అమరావతిలోని ఉండవల్లి గుహల వద్ద యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. రాందేవ్ బాబా శిక్షణలో జరుగుతున్న యోగా సాధనను తిలకించారు. ఈ సందర్భంగా వివిధ రకాల యోగా పక్రియలను రాందేవ్ బాబా సీఎంకు వివరించారు. బాబారామ్‌దేవ్‌తో కలిసి సీఎం యోగా సాధన చేశారు. **మిగతా 2లో...**



# ఒడిషాలో 47వేల కోట్లతో అభివృద్ధి పనులు

**రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా మోడీ ప్రకటన**

**రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలసి ప్రారంభించిన ప్రధాని**

**ముర్ము స్వగ్రామం పహాడ్‌పూర్‌ను సందర్శించిన మోడీ**

**అభివృద్ధి చేసి సోలార్ విలేజ్‌గా మారుస్తామని ప్రకటన**

**భువనేశ్వర్,జూన్ 20: (ప్రజావినికిడి):**
ఒడిషా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో జరిగిన 'వికాస్ రా ధారా, ఒడిశా సారా' బహిరంగ సభలో **మిగతా 2లో...**

# పరేడ్ గ్రౌండ్ యోగా

**హైదరాబాద్,జూన్20(ప్రజావినికిడి):** అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో పెద్ద ఎత్తున యోగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారీగా ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు హాజరయ్యారు. తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఎంపీలు ఈటల రాజేందర్, లక్ష్మణ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, సినీ నటులు నవీన్ పోలిశెట్టి, డింపుల్ హయాతి తదితరులు**మిగతా 2లో...**



# నిరాహార దీక్ష చేస్తా

## : కాంగ్రెస్ ప్రభుత్వానికి కవిత వార్నింగ్



**సింగరేణి బాయిబాట కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి జిల్లాలోని గనిని సందర్శించిన కవిత**

**మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న 1200 మంది ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్**

**ఉద్యోగాలు ఇవ్వకపోతే జులై 20 నుంచి నిరాహార దీక్షకు కూర్చుంటానని హెచ్చరిక**

**జూన్ 20: (ప్రజావినికిడి):**
సింగరేణి 'బాయిబాట' కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈరోజు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కేటీకే-5 గనిని సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలపై ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, సింగరేణి యాజమాన్యంపై**మిగతా 2లో...**

# నేడు నీట్ రీ-ఎగ్జామ్

## నిర్వహణకు సర్వం సిద్ధం

**దేశవ్యాప్తంగా 22.79 లక్షల మంది దరఖాస్తు**

**రాష్ట్రంలో 199 పరీక్షా కేంద్రాలు, 73,084 మంది విద్యార్థులు**




**హైదరాబాద్‌జూన్ 20: (ప్రజావినికిడి):**
వైద్య విద్య ప్రవేశాలకు నిర్వహించే నీట్ (యూజీ)-2026 రీ-ఎగ్జామ్ ఆదివారం జరగనుంది. ప్రశ్నాపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో రద్దు చేసిన గత పరీక్షకు బదులుగా జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) ఈ రీ-ఎగ్జామ్‌ను నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా 22.79 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్ష కోసం నమోదు చేసుకున్నారు. దేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో 5,432 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నారు.**మిగతా 2లో...**

# 'మెట్రో' పై కిషన్ రెడ్డికి రేవంత్ మరో లేఖాస్త్రం

**రైల్వే మంత్రితో భేటీకి ఏర్పాట్లు చేయాలని కిషన్ రెడ్డికి విజ్ఞప్తి**

**అధికారులు, పత్రాలతో సమావేశానికి హాజరవుతానని వెల్లడి**

**జూన్ 22, 23 తేదీల్లో ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్న ముఖ్యమంత్రి**



**హైదరాబాద్‌జూన్ 20: (ప్రజావినికిడి):**
హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ అంశాల పరిష్కారంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించారు. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. జూన్ 22, 23 తేదీల్లో తాను **మిగతా 2లో...**

# కొత్త ఓటరు నమోదుపై అబద్ధాలు నమ్మకండి

**: తెలంగాణ 'సర్' ప్రక్రియపై ఎస్ఈవో సుదర్శన్‌రెడ్డి**

**కొత్త ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం లేదంటూ తప్పుడు ప్రచారం**

**బూత్ లెవెల్ ఆఫీసర్లు ప్రతి ఇంటికి వస్తారన్న ఎస్ఈవో సుదర్శన్ రెడ్డి**

**కొత్త ఓటర్లు వారి వివరాలను నమోదు చేసుకోవచ్చని క్లారిటీ**

**హైదరాబాద్‌జూన్ 20: (ప్రజావినికిడి):**
తెలంగాణ ఓటర్లకు, యువతకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక అధికారిక అప్‌డేట్ ఇచ్చింది. రాష్ట్రంలో కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం లేదంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (ఎస్ఈవో) సుదర్శన్ రెడ్డి చెక్ పెట్టారు. ఓటరు జాబితా ప్రక్షాళన కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ప్రక్రియపై ఈరోజు హైదరాబాద్‌లో మీడియా సమావేశం **మిగతా 2లో...**



# హార్ముజ్ మళ్లీ క్లోజ్

**ఇరాన్ కీలక నిర్ణయం**

**లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడుల ఎఫెక్ట్**

**అమెరికా తన హామీలను నెరవేర్చే వరకు చర్చల్లో ఎలాంటి పురోగతి ఉండదని వెల్లడి**



**టెహ్రాన్ : జూన్ 20: (ప్రజావినికిడి):**
ప్రపంచ ఇంధన సరఫరాకు కీలక మార్గమైన హార్ముజ్ జలసంధి మళ్లీ మూత పడింది. లెబనాన్‌లో ఇజ్రాయిల్ దాడులు ఆపకపోవడంతో హార్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్టు ఇరాన్ ప్రకటించింది. అమెరికా- ఇరాన్ మధ్య కుదిరిన తాత్కాలిక శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ ఇజ్రాయిల్ **మిగతా 2లో...**

# దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్

**మొదటిపేజీ తరువాయి**

రామ్‌దేవ్ శిక్షణలో జరుగుతున్న యోగా సాధనను తిలకించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. యోగాకు.. రాందేవ్ బాబా మంచి గుర్తింపు తీసుకొచ్చారన్నారు. యోగా సాధనతో ఆయన అద్భుతాలు సృష్టిస్తున్నారని కొనియాడారు. ఆయన శిక్షణలో యువత యోగాసనాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం సమాజంలో యువత చాలా ఒత్తిడితో ఉందన్న సీఎం.. ఆధ్యాత్మికతతో కూడిన సాంకేతికత చాలా అవసరమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 190 దేశాలు యోగాను అనుసరిస్తున్నాయని వివరించారు. బాబారామ్‌దేవ్ ఏదైనా చేయగలరన్నారు. యోగాకు.. రామ్‌దేవ్ మంచి గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. యోగా మన సంప్రదాయం, విజ్ఞానం, వారసత్వ సంపద అని చెప్పుకొచ్చారు. ప్రస్తుత సమాజంలో యువత చాలా ఒత్తిడితో ఉందని సీఎం అన్నారు. ఆధ్యాత్మికతతో కూడిన సాంకేతికత చాలా అవసరమని తెలిపారు. దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఏపీ మారనుందని పేర్కొన్నారు. ఉండవల్లి కొండల వద్ద యోగా.. చాలా అందమైన ఆలోచన అని



అన్నారు. అమరావతి కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ యునైటెడ్ నేషన్స్‌ను ఒప్పించి ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. 20 లక్షల ఎకరాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 31శాతం ఉన్న పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. రాందేవ్‌బాబా మాట్లాడుతూ.. అభివృద్ధి, విజన్ కలిగిన సీఎం.. చంద్రబాబు అని కితాబిచ్చారు. ప్రధాని వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా సీఎం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలోనే విజన్ ఉన్న నాయకుడని అన్నారు. గత 30 సంవత్సరాలుగా చంద్రబాబు ఏం అడుగుతారో.. తాము అది చేస్తున్నామని తెలిపారు. యోగా మన సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమని రామ్‌దేవ్ బాబా తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు అందర్నీ సమానంగా చూస్తారని.. అందుకే ప్రజలు ఆయన్ను దేవుడిలా భావిస్తారన్నారు. అమరావతి దేవతల రాజధాని అని.. ఇక్కడ 40 శాతం పచ్చదనం, 60 శాతం నిర్మాణాలు ఉంటాయన్నారు. ఇది దేవ భూమి అని వెల్లడించారు. స్విట్జర్లాంట్ కోసం వెళ్లాల్సిన అవసరం లేదని... ఆంధ్రప్రదేశ్ వస్తే చాలని చెప్పారు. ఇక్కడి మామిడికాయలు, అరటిపండ్లు చాలా బాగుంటాయని.. ఎందుకంటే వాటిని సహజ సిద్ధంగా పండిస్తారని తెలిపారు. ఈసారి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' పేరుతో నిర్వహిస్తున్నామని రామ్‌దేవ్ బాబా పేర్కొన్నారు.

## పోక్సో కేసులో బండి భగీరథ్‌కు మధ్యంతర బెయిల్

**మొదటిపేజీ తరువాయి** ఆయనకు వారంపాటు మధ్యంతర బెయిల్ మంజూరు ఇచ్చింది. ఇంజనీరింగ్ సెమిస్టర్ పరీక్షలు ఉన్నందున పరీక్షలకు హాజరయ్యేందుకు కోర్టు అతనికి తాత్కాలిక బెయిల్ ఈ నెల 26 వరకు మంజూరు చేసింది. గత నెల 16న పోక్సో కేసులో భగీరథ్ ను పోలీసులు అరెస్ట్ చేసారు. పేట బషీర్‌బాగ్ పోలీస్ స్టేషన్‌లో గత నెల 9న కేసు నమోదు తర్వాత అరెస్ట్ భయంతో పరారయిన నిందితుడు, ముందస్తు బెయిల్, లేదా అరెస్ట్ తరువాత మధ్యంతర బెయిల్ ఇవ్వాలని అభ్యర్థిస్తూ తన న్యాయవాదుల ద్వారా హై కోర్టు ను ఆశ్రయించాడు. అయితే ఈ పిటిషన్ ను విచారించిన హై కోర్టు వెకేషన్ కోర్టు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించడంతో భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా పరీక్షల నిమిత్తం ఆయన జైలను నుంచి విడుదల అయ్యారు.

## పరేడ్ గ్రౌండ్ యోగా

**మొదటిపేజీ తరువాయి** పాల్గొని యోగా సాధన చేశారు. ఏటా మాదిరిగానే యోగా కార్యక్రమం నిర్వహించినట్టు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. నిత్యం యోగా చేయడం వల్ల రుగ్మతల బారిన పడకుండా ఉండొచ్చని తెలిపారు.



## నిరాహార దీక్ష చేస్తా



**మొదటిపేజీ తరువాయి**

తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సింగరేణిలో మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకుని పెండింగ్‌లో ఉన్న దాదాపు 1200 మంది వారసులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ఒక నెల రోజులు టైమ్ ఇస్తున్నామని, ఆలోగా ప్రక్రియ పూర్తి చేయకపోతే జులై 20 నుంచి తాను నిరాహార దీక్షకు కూర్చుంటానని హెచ్చరించారు. సింగరేణిలో ఏ చిన్న పని జరగాలన్నా నేరుగా డిప్యూటీ సీఎం ఆఫీస్ నుంచే లంచాలు అడుగుతున్నారంటూ కవిత సంచలన ఆరోపణ చేశారు. కాంగ్రెస్ పాలనలో లాభాల్లో ఉన్న సింగరేణిని నష్టాల్లోకి నెట్టేస్తున్నారని మండిపడ్డారు. మొన్న జరిగిన ప్రమాదంలో ఒక కార్మికుడికి తీవ్ర గాయాలవడానికి యాజమాన్యం వాడుతున్న నాసిరకం డిటోనేటర్లే కారణమన్నారు. గనుల లోపల పని చేసే కార్మికులకు కనీసం స్వచ్ఛమైన గాలి, మంచి నీరు కూడా ఇవ్వకుండా అధికారులు కక్కుర్తి పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిటైర్ అయిన కార్మికులకు సొంత ఇంటి కల నెరవేర్చడం కోసం సింగరేణికి ప్రత్యేకంగా 'హౌసింగ్ బోర్డు' ఏర్పాటు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం లేదా కార్మిక సంఘం తరపున రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందించాలన్నారు. అలాగే విజిలెన్స్ ఎంక్వైయిరీల పేరుతో కార్మికులను భయభ్రాంతులకు గురిచేయవద్దని అన్నారు. ఉద్యమ కాలం నుంచే తాను సింగరేణి కార్మికులతో కలిసి నడిచానని గుర్తుచేసిన కవిత... తెలంగాణ హక్కుల కోసం తాను స్థాపించిన 'తెలంగాణ రక్షణ సేన' పార్టీని భూపాలపల్లి ప్రజలు, బొగ్గుగని కార్మికులు గుండెల్లో పెట్టుకుని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

# ఆరోగ్యమే అభివృద్ధికి అసలైన సూచిక

**మొదటిపేజీ తరువాయి**

ఒక్క క్షణంలో కరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదవాడు ఎటువంటి భయం లేకుండా ఆసుపత్రిలో అడుగుపెట్టేలా తక్కువ ధరకు వైద్యం అందుబాటులో ఉండాలన్నారు. దేశం ఆర్థికంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలోనే తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఎయిమ్స్ వంటి ఉన్నతమైన వైద్య విద్యాసంస్థలను స్థాపించి దేశానికి ఒక దిశను చూపించారన్నారు. పేద దేశంలో వైద్యం అనేది విలాసంగా మారకూడదనే ఉద్దేశంతో ఆనాడు పునాది వేశారన్నారు. అదేవిధంగా 1975లో ఇందిరా గాంధీ గారు తీసుకొచ్చిన సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకాన్ని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ హయాంలో తీసుకొచ్చిన యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ ద్వారా దేశవ్యాప్తంగా వ్యాక్సినేషన్ పక్రియను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లారన్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ గారి నాయకత్వంలో వచ్చిన జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్, ఆశా వర్కర్ల వ్యవస్థ గ్రామీణ ఆరోగ్య ముఖచిత్రాన్ని మార్చివేసిందని గుర్తుచేశారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు ప్రవేశపెట్టిన 'ఆరోగ్యశ్రీ' పథకం పేదవాడి ఆరోగ్యానికి భరోసా ఇచ్చిందన్నారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ చావుకు దగ్గర కాకూడదని కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతానికి నిదర్శనమని అన్నారు. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సాయం అందిస్తూ, గుండె, కిడ్నీ వంటి ఖరీదైన జబ్బులకు సైతం పేదవాడు ధైర్యంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందేలా ఈ పథకం అండగా నిలిచిందన్నారు. వైద్య రంగంలో వస్తున్న టెక్నాలజీ, టెలిమెడిసిన్, సరికొత్త పరికరాలు కేవలం కార్పొరేట్ వర్గాలకే పరిమితం కాకుండా అట్టడుగు వర్గాలకు సైతం అందాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. నాయకత్వం అనేది ఒక సర్టిఫికేట్ కాదు, అదొక బాధ్యత అని వ్యాఖ్యానిస్తూ, సైన్స్ అనేది సామాన్యుడికి, టెక్నాలజీ అనేది పేదవాడికి సేవ చేయాలన్నారు. ప్రస్తుత వైద్య విధానం వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స అందించే 'ఇల్‌నెస్ కేర్' గా మాత్రమే ఉండిపోకూడదన్నారు. వ్యాధి రాకుండా ముందే నివారించే 'వెల్‌నెస్ కేర్' గా మారాలని ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఐసీయూల కంటే వ్యాధి నివారణెళి అత్యంత చౌకైన మార్గమని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ నేడు దేశంలోనే పబ్లిక్ హెల్త్ క్యాపిటల్‌గా అవతరించిందని భట్టి విక్రమార్క ప్రకటించారు. రాష్ట్రంలోని జిల్లా ఆసుపత్రుల బలోపేతం, వైద్య విద్యాసంస్థల విస్తరణ, నర్సింగ్ మరియు పారామెడికల్ రంగాలను ప్రోత్సహించడం ద్వారా వైద్య రంగాన్ని ముందుకు తీసుకువెళుతున్నామని అన్నారు. వైద్య రంగంలో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం అనేది కేవలం వ్యాపార లాభాల కోసం కాకుండా, ప్రభుత్వ ఆశయాలకు ప్రైవేట్ రంగానికి ఉన్న నైపుణ్యాలను జోడించి ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడానికే ఉపయోగపడాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వచ్చే దశాబ్ద కాలంలో వైద్య రంగానికి అవసరమైన మానవ వనరులను, నైపుణ్యాలను అందించడానికి తెలంగాణ పూర్తిగా సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం ప్రకటించారు. హైదరాబాద్‌లో ఉన్న బలమైన ఫార్మాస్యూటికల్ బేస్, మెడికల్ డివైజెస్ పార్క్, ఐటీ టాలెంట్ మరియు ప్రభుత్వ అండదండల వల్ల తెలంగాణ ప్రపంచంలోనే మెడికల్ ఎక్సలెన్స్ ఇకోసిస్టమ్‌కు కేంద్రంగా మారిందన్నారు. ఇక్కడి నుంచే భారతదేశానికి, ప్రపంచానికి ఉపయోగపడే సరికొత్త హెల్త్ కేర్ ప్రొటోకాల్స్, డయాగ్నోస్టిక్స్ మరియు డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌లు రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు.

# ఒడిషాలో 47వేల కోట్లతో అభివృద్ధి పనులు

**మొదటిపేజీ తరువాయి**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడిశా సర్వతోముఖాభివృద్ధి కోసం దాదాపు రూ.47,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం రోజే ఈ కార్యక్రమం జరగడం విశేషం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం సందర్భంగా ఆమె స్వగ్రామమైన పహాడ్‌పూర్‌ను ప్రధాని మోదీ సందర్శించారు. ఈ గ్రామాన్ని వేగంగా అభివృద్ధి చేసి 'సోలార్ విలేజ్'గా మారుస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికీ సౌరశక్తి అందుతుంది. ఒడిశాలోని ప్రసిద్ధ కోణార్క్ సూర్య దేవాలయానికి ఉన్న గుర్తింపు తరహాలోనే, పహాడ్‌పూర్ గ్రామం కూడా ప్రపంచపటంలో పునరుత్పాదక ఇంధన కేంద్రంగా సరికొత్త గుర్తింపును పొందుతుందని ప్రధాని పేర్కొన్నారు. ఒడిశాలోని సహజ వనరులను ఆర్థిక అవకాశాలుగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రధాని తెలిపారు. రాష్ట్రంలో భారీగా పారిశ్రామిక వృద్ధి జరుగుతోందని, అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంలో 'ఉత్కర్ష్ ఒడిశా' ప్రచారం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన కొనియాడారు. కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలను అందించడం ద్వారా వారిని సాధికారత వైపు నడిపించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ పునరుద్ఘాటించారు. గిరిజన పిల్లలకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు దేశవ్యాప్తంగా సుమారు 500 ఏకలవ్య మోడల్ స్కూళ్లను ప్రారంభించామని తెలిపారు. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కలిసి పహాడ్‌పూర్ గ్రామంలోని 'సంతాలీ జాహిరా', 'హో జాహిరా' అనే పవిత్ర వనాలలో సంప్రదాయ పూజలు, ఆచారాలు నిర్వహించి దేశ శ్రేయస్సు కోసం ప్రార్థించారు. ప్రస్తుతం ఒడిశాలో పండుగ వాతావరణం నెలకొందని, గత వారమే 'గాన్ పర్వ' పండుగను ఘనంగా జరుపుకున్నారని, అలాగే జగన్నాథ రథయాత్ర, బరిపద రథయాత్ర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని ఈ సందర్భంగా ప్రధాని గుర్తుచేశారు. ఈ ఉత్సవాల మధ్య 'ప్రజాస్వామ్యం, అభివృద్ధి' అనే పండుగ కూడా ఇక్కడ నడుస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# నేడు నీట్ రీ-ఎగ్జామ్

**మొదటిపేజీ తరువాయి**

తెలంగాణ నుంచి 73,084 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మొత్తం 199 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాయి. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పెన్-అండ్-పేపర్ విధానంలో జరుగుతుంది. బయోమెట్రిక్ ధృవీకరణ, బహుళస్థాయి తనిఖీలు, కేంద్రాల పర్యవేక్షణ కోసం ప్రత్యేక చర్యలు అమలు చేస్తున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. అభ్యర్థులు అడ్మిట్ కార్డు, చెల్లుబాటు అయ్యే ఫొటో గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలి. పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలనీ, నిషేధిత వస్తువులను తీసుకురావద్దని పరీక్ష నిర్వహణా సంస్థ ఎన్‌టీఏ హెచ్చరించింది. డ్రస్ కోడ్, ప్రవేశ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొంది. సోషల్ మీడియాలో ప్రశ్నాపత్రాలు, ఆన్సర్ కీలు, ప్రత్యేక సేవల పేరుతో వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని అభ్యర్థులకు సూచించిం ది. అధికారిక సమాచారం కోసం ఎన్‌టీఏ వెబ్‌సైట్, ధృవీకరించిన వాట్సాప్ సేవలను ఉపయోగించుకోవాలని తెలిపింది. పరీక్ష నిర్వహణకు ముందు దేశవ్యాప్తంగా శనివారం మాక్‌డ్రిల్ నిర్వహించి కేంద్రాల సన్నద్ధతను పరిశీలించినట్టు అధికారులు తెలిపారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా పరీక్ష నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్‌టీఏ వెల్లడించింది.

# హార్ముజ్ మళ్లీ క్లోజ్

**మొదటిపేజీ తరువాయి**

ఈ దాడులకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండించింది. అమెరికా తన బాధ్యతల నుంచి తప్పుకోవడాన్ని నిరసిస్తూ ఇరాన్ ఉమ్మడి సైనిక కమాండ్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఇజ్రాయిల్ దాడులు, అమెరికా నమ్మకద్రోహానికి ఇది మొదటి అడుగేనని, దాడులు ఆగకపోతే తదుపరి కఠిన చర్యలు ఉంటాయని ఇరాన్ హెచ్చరించింది. మరోవైపు స్విట్జర్లాండ్‌కు తమ దౌత్య బృందాన్ని పంపుతున్నట్టు ప్రకటిస్తూనే అమెరికా తన హామీలను నెరవేర్చే వరకు చర్చల్లో ఎలాంటి పురోగతి ఉండబోదని టెహ్రాన్ తేల్చి చెప్పింది. సైనిక హెచ్చరికల తర్వాత ఇరాన్ తన దౌత్య వ్యూహాన్ని కూడా మార్చింది. గత శుక్రవారమే జరగాల్సి ఉండి రద్దయిన స్విట్జర్లాం డ్‌లో శాంతి చర్చల కోసం తమ ప్రతినిధి బృందం బయలుదేరినట్టు ఇరాన్ ప్రకటించింది. అయితే ఈ పర్యటన కేవలం అమెరికాను నిలదీయడానికేనని స్పష్టం చేసింది. లెబనాన్‌లో యుద్ధం ఆపడం సహా కీలక హామీలను అమెరికా నెరవేరిస్తేనే తుది ఒప్పందంపై చర్చలు ముందుకు సాగుతాయని తెలిపింది. ఈ అవగాహన ఒప్పందంలో ఏ ఒక్క నిబంధన ఉల్లంఘించినా, మొత్తం శాంతి ప్రక్రియే ప్రమాదంలో పడుతుందని ఇరాన్ హెచ్చరించింది.

కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ లెబనాన్‌లో ఇజ్రాయిల్ తరచూ దాడులు జరపడంపై ఇరాన్ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఈ కారణంతోనే ఇరాన్ హార్ముజ్ జలసంధి మూసివేత కఠిన నిర్ణయాన్ని తీసుకుంది. వాస్తవానికి అమెరికా- ఇరాన్ ఒప్పందంలో ఇటు ఇజ్రాయిల్ గానీ, అటు హిజ్బుల్లా గానీ భాగస్వాములు కావు. తాము హిజ్బుల్లాను పూర్తిగా నిర్మూలించే వరకు దక్షిణ లెబనాన్ నుంచి సైన్యాన్ని వెనక్కి తీసుకునే ప్రసక్తే లేదని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు. ఈ దాడుల వల్ల స్విట్జర్లాండ్‌లో అమెరికా, ఇరాన్, ఖతార్ దౌత్యవేత్తల మధ్య జరగాల్సిన ఉన్నత స్థాయి చర్చలు మరింత ఆలస్యమయ్యేలా కనిపిస్తున్నాయి. కాగా తాజా పరిణామాల నేపథ్యంలో ఇంధన ధరలకు మళ్లీ రెక్కలు వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అయితే వచ్చే వారం వాషింగ్టన్‌లో ఇజ్రాయిల్, లెబనాన్ ప్రభుత్వాల మధ్య జరగబోయే అమెరికా మధ్యవర్తిత్వ చర్చలైనా ఈ సంక్షోభానికి తెరదించుతాయో లేదో చూడాలని విశ్లేషకులు చెప్తున్నారు.

## కొత్త ఓటరు నమోదుపై అబద్ధాలు నమ్మకండి

**మొదటిపేజీ తరువాయి**

నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించారు.సుదర్శన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల జూన్ 25 నుంచి బూత్ లెవెల్ ఆఫీసర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ స్వయంగా రానున్నారు. వారు ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారు. ఈ వివరాల సేకరణ ప్రక్రియను పూర్తి చేసి జూలై 25 లోపు నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ఎవరైనా కొత్తగా ఓటు హక్కు పొందాలనుకుంటే అదే ఫారంలో తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని క్లారిటీ ఇచ్చారు.ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా ఉండేందుకు ఇప్పటికే మ్యాపింగ్ వేగంగా సాగుతోంది. చాలా ప్రాంతాల్లో ఇప్పటికే 80 శాతం మ్యాపింగ్ పనులు పూర్తయ్యాయి. 2002 నాటి ఓటరు డేటాతో అనుసంధానమైన వారికి కొత్తగా ఎలాంటి ఇతర డాక్యుమెంట్లు అవసరం లేదు. వలస వచ్చిన వారు లేదా కొత్త ఓటర్ల కోసం ప్రభుత్వం జారీ చేసిన ప్రామాణిక పత్రాలను అనుమతిస్తామని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.

ఈ మొత్తం డ్రైవ్ పారదర్శకంగా సాగేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా నియమించినట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి గందరగోళం లేకుండా ఉండేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిరంతరం సమావేశాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. అన్ని ప్రక్రియలు ముగించుకుని అక్టోబర్ 1వ తేదీన తెలంగాణ తుది ఓటరు జాబితాను అధికారికంగా ప్రచురిస్తామని తెలిపారు.

## 'మెట్రో' పై కిషన్ రెడ్డికి రేవంత్ మరో లేఖాస్త్రం


**మొదటిపేజీ తరువాయి**

ఢిల్లీ పర్యటనలో ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత పత్రాలతో వస్తానని, అధికారులతో కలిసి సమావేశానికి హాజరవుతానని ఆ లేఖలో పేర్కొన్నారు.ప్రధానంగా మెట్రో మొదటి దశకు సంబంధించిన ఐఆర్‌ఎఫ్‌సీ (ఐఆర్‌ఎఫ్‌సీ) నిధుల విడుదల, రెండో దశ విస్తరణకు అవసరమైన అనుమతులపై చర్చించాల్సి ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరానికి మెట్రో రైలు అత్యంత కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టు అని ఆయన ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. పెండింగ్ అంశాలపై త్వరితగతిన సానుకూల నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి తన లేఖలో వివరించారు.

# పీఎం కిసాన్ డబ్బులు విడుదల

### రూ. 2,000 చొప్పున 18,880 కోట్లు జమ

### హుగ్లీ జిల్లాలో విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ



**కోల్‌కతా,జూన్ 20: (ప్రజావినికిడి):** పీఎం కిసాన్ డబ్బులు విడుదలయ్యాయి. ప్రధాని మోదీ 23వ విడత నిధులను విడుదల చేశారు. ఈ విడత ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 9.44 కోట్ల మందికి పైగా అర్హులైన రైతు కుటుంబాల ఖాతాల్లోకి రూ. 2,000 చొప్పున మొత్తం రూ. 18,880 కోట్లు నేరుగా జమయ్యాయి. రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం- కిసాన్నిధులు విడుదలయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేశారు. 23వ విడత కింద ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున జమ అయ్యాయి. దీంతో దేశవ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరింది. కేందప్రభుత్వం 2019లో పీఎం-కిసాన్ పథకాన్ని ప్రారంభించింది. ఏటా మూడు దఫాలుగా రూ.2 వేలు చొప్పున మొత్తంగా రూ.6వేలను రైతుల ఖాతాల్లో వేస్తున్నారు. పీఎం కిసాన్ నిధులు పొందే వారి జాబితాలో మీ పేరుందో లేదో తెలుసుకోవచ్చు. ఇందుకోసం పీఎం కిసాన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లిఅందులో 'ఫార్మర్ కార్నర్' సెక్షన్‌లోకి వెళ్లాలి. అందులో లబ్దిదారుల లిస్ట్‌పై క్లిక్ చేస్తే రాష్ట్రం, జిల్లా, బ్లాక్, గ్రామం ఎంచుకుంటే లబ్దిదారుల జాబితా కనిపిస్తుంది. అందులో మీ పేరు ఉందో లేదో తెలుసుకోవచ్చు. ఇ-కేవైసీ చేయని వారికి నిధులు జమ కావు. కాబట్టి అదే పోర్టల్‌లో ఇ-కేవైసీ ఆప్షన్ ఎంచుకుని ఆధార్ నంబర్, ఓటీపీ ద్వారా వెరిఫికేషన్ పూర్తి చేయొచ్చు.

# ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం

## షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్

## మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు నిరసనగా గాంధీభవన్‌లో సత్యాగ్రహ దీక్ష







**షాద్ నగర్,(ప్రజావినికిడి):**కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు నిరసనగా గాంధీభవన్‌లో నిర్వహించిన సత్యాగ్రహ దీక్షలో షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మైనార్టీ నాయకుడు మహ్మద్ ఇబ్రహీం,సీనియర్ నాయకుడు చందూలాల్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు.మధ్యప్రదేశ్‌లో భారతీయ జనతా పార్టీకి రాజ్యసభ సీటు గెలిచేంత సంఖ్యాబలం లేకపోయినా మూడో అభ్యర్థిని బరిలోకి దింపి ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేసిందని మండిపడ్డారు.ప్రజాస్వామ్య సూత్రాలను కాలరాస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించిన ఆయన,భారతీయ జనతా పార్టీ ఓట్ల చోరీ మాత్రమే కాకుండా సీట్ల చోరీకి కూడా  పాల్పడుతోందని విమర్శించారు. రాజ్యసభ ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత,న్యాయం పాటించాలని,ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మీనాక్షి నటరాజన్‌కు మద్దతు ప్రకటించారు.

# షాద్‌నగర్‌లో ఎస్సీ,ఎస్టీ,బీసీ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి

## 15 ఏళ్లుగా అద్దె భవనాల్లోనే విద్యార్థుల అవస్థలు

## నిర్లక్ష్యం కొనసాగితే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు తప్పవు

## ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నరసింహ మాదిగ



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** షాద్‌నగర్ పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ,బీసీ విద్యార్థుల హాస్టళ్లకు తక్షణమే సొంత భవనాలు నిర్మించాలని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నరసింహ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత 15 సంవత్సరాలుగా ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ హాస్టళ్లు మాత్రం అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

షాద్‌నగర్ పట్టణంలో ఎస్సీ ప్రీ-మెట్రిక్ బాలికల హాస్టల్,ఎస్టీ ప్రీ-మెట్రిక్ బాలుర హాస్టల్, బీసీ ప్రీ-మెట్రిక్ బాలుర హాస్టల్,పోస్ట్ మెట్రిక్ ఎస్సీ బాలుర హాస్టల్‌తో పాటు బీసీ,ఎస్టీ బాలురు,బాలికల హాస్టళ్లు కలిపి మొత్తం ఏడు హాస్టళ్లు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ హాస్టళ్లలో విద్యార్థులకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవని విమర్శించారు. సరైన బాత్‌రూమ్‌లు, భద్రతా ఏర్పాట్లు, కిటికీలు,బట్టలు ఆరబెట్టుకునే సదుపాయం, విశాలమైన చదువు గదులు వంటి సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

అద్దె భవనాల యజమానులకు నెలల తరబడి అద్దెలు చెల్లించకపోవడంతో గతంలో హాస్టళ్లకు తాళాలు వేసిన ఘటనలు కూడా జరిగాయని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందన్నారుతెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్యకు పెద్దపీట వేస్తామని చెప్పిన ప్రభుత్వాలు విద్యార్థుల సమస్యల పరిష్కారంలో విఫలమయ్యాయని ఆరోపించారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా హాస్టళ్ల సమస్యలపై మాటలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ఇకనైనా సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి,స్థానిక ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ స్పందించి శిథిలావస్థలో ఉన్న హాస్టళ్ల స్థానాల్లోనే నూతన భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు జోగు నాగభూషణ్ మాదిగ,కల్లేపల్లి బాలరాజు మాదిగ, నాగర్‌కుంట మహేందర్ మాదిగ,సంగెం శ్రీనివాస్ మాదిగ, సంగెం మచ్చేందర్ మాదిగ,అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

# రవీంద్రభారతిలో తెలంగాణ వాగ్గేయకారుల భజన ప్రదర్శనలు

## "తెలంగాణ ప్రజా కళా సాంస్కృతిక సంబరాలు"






**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
తెలంగాణ ప్రభుత్వం అంతరించిపోతున్న కళారూపాలను పరిరక్షించి ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న "తెలంగాణ ప్రజా కళా సాంస్కృతిక సంబరాలు" కార్యక్రమంలో భాగంగా రవీంద్రభారతిలో భజన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల సాంస్కృతిక కళారూపాల ప్రదర్శనల్లో తెలంగాణ వాగ్గేయకారుల భజన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా పాల్కురికి సోమనాథుడి సాహిత్య సంపదను ప్రతిబింబిస్తూ కళాకారులు భజనలను ప్రదర్శించారు. మాస్టర్ గౌనింటి వీరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చల్లా శ్రీకాంత్ రెడ్డి, రంగంపల్లి రమేష్ గౌడ్,ఎర్రోళ్ల జంగయ్య, పరశురాములు, సంపత్ కుమార్, ప్రవీణ్,రామకృష్ణ, ముఖేష్ యాదవ్, పరుశు రామ్ యాదవ్, గోపాల్ తదితరులు పాల్గొని తమ కళా ప్రతిభను చాటారు.కార్యక్రమం అనంతరం భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి కళాకారులను అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. తెలంగాణ జానపద, భక్తి కళారూపాల పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు కళాకారులకు ప్రోత్సాహకరంగా ఉన్నాయని పాల్గొన్న వారు పేర్కొన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని పాతాళంలో పాతర వేస్తున్న బీజేపీ

## ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనునాయక్




**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
ప్రజాస్వామ్య విలువలను బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనునాయక్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన "సేవ్ డెమోక్రసీ-శాంతి సత్యాగ్రహం" కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాస్వామ్యవాదులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. షాద్‌నగర్ నుంచి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నాయకత్వంలో సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్,కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా శ్రీనునాయక్ మాట్లాడుతూ, సత్యం,అహింస, శాంతి మార్గాలను అనుసరిస్తున్న కాంగ్రెస్ నాయకులపై బీజేపీ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. మధ్యప్రదేశ్‌లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్రపూరితంగా తిరస్కరించాయని ఆరోపించారు. రాజ్యాంగబద్ధ సంస్థలను తమ చేతుల్లో పెట్టుకొని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యవాదుల గొంతు నొక్కుతోందని, దేశవ్యాప్తంగా ఎన్నికల వ్యవస్థపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. మహాత్మా గాంధీ ఆశయాలకు కట్టుబడి ప్రజాసేవ చేస్తున్న మహిళా నాయకురాలు మీనాక్షి నటరాజన్‌ను రాజ్యసభకు రానీయకుండా అడ్డుకోవడం మహిళా వ్యతిరేక చర్యగా అభివర్ణించారు.దేశంలోని ప్రజాస్వామ్యవాదులందరూ రాజ్యాంగ పరిరక్షణ కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చిన శ్రీనునాయక్, ఆర్ఎస్ఎస్ రాజరిక ధోరణులు, మహిళా వ్యతిరేక, రైతు వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండించారు. పేదలు, గిరిజనులు, బలహీన వర్గాల హక్కులను కాపాడేందుకు ప్రజలు బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు.

# కేసీఆర్ ప్రభుత్వంలోనే రైతులకు నిజమైన మేలు

## షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్

## రైతుబంధును ఏకకాలంలో విడుదల చేయాలి

## రైతులకు యాప్ అవసరం లేదు..

## ఎరువులు అందుబాటులో ఉంచాలి

## వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెడితే సహించబోం

## అన్ని రకాల పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేయాలి

## కాంగ్రెస్ హయాంలో ఎరువుల కరువు..



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో వ్యవసాయ రంగానికి జరిగిన మేలును తెలంగాణ రైతాంగం ఎన్నటికీ మర్చిపోదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రైతులకు అదే స్థాయిలో మేలు చేసే విధంగా పాలన అందించాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ అన్నారు. రైతుబంధు,రైతు బీమా,ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా రైతులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని రైతులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. షాద్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ రంగానికి నాణ్యమైన, అంతరాయం లేని 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందించడం వల్ల రైతులు రాత్రి వేళల్లో పొలాలకు వెళ్లే ఇబ్బందులు తప్పాయని గుర్తు చేశారు.ప్రస్తుతం నాణ్యమైన విద్యుత్ సరఫరా లేకపోవడంతో పాటు విద్యుత్ కోతలు పెరిగాయని ఆరోపించారు. రైతుబంధు పథకం ద్వారా ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.10 వేల పెట్టుబడి సాయాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం వల్ల విత్తనాలు, ఎరువుల కోసం రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా పోయిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు పెట్టుబడి సాయం ఏకకాలంలో అందడం లేదని విమర్శించారు. రైతుబంధు నిధులను గతంలో మాదిరిగానే ఒకేసారి విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతు బీమా పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రైతు ఏ కారణంతో మరణించినా వారి కుటుంబ సభ్యులకు వారం రోజుల్లోగా రూ.5 లక్షల బీమా సాయం అందేలా చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని తెలిపారు.

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం,మిషన్ కాకతీయతో పాటు పలు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా బీడు భూములకు సైతం సాగునీరు అందిందని,దీంతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందన్నారు. పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో అనేక లిఫ్టులను పూర్తి చేశారని, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు పూర్తికాకపోయినా ఆ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రణాళికలు, చర్యలు గత ప్రభుత్వ హయాంలోనే చేపట్టినట్లు గుర్తు చేశారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు ఆలోచన కూడా కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించిందని అన్నారు.ప్రస్తుతం ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తోందని, ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో కొన్ని రకాల పంటలను మాత్రమే కొనుగోలు చేస్తున్న పరిస్థితి నెలకొందని విమర్శించారు. ప్రభుత్వం అన్ని రకాల పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

గతంలో మార్కెట్లకు భారీగా ధాన్యం వచ్చినా కొనుగోలు ప్రక్రియను సమర్థంగా నిర్వహించేవారని, ప్రస్తుతం వచ్చిన కొద్దిపాటి ధాన్యాన్ని కూడా పూర్తిస్థాయిలో కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో రైతులకు న్యాయం జరిగిందని అన్నారు.

ఎరువుల కొనుగోలు కోసం యాప్ విధానాన్ని



తీసుకురావడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. రాష్ట్రంలో ఎంతోమంది రైతులకు చదువు రాకపోవడంతో యాప్ ఆధారిత విధానం వారికి ఇబ్బందికరంగా మారుతుందని, వెంటనే ఆ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో ఎరువుల కొరత ఏర్పడిందని ఆరోపించారు.

వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేసే ప్రయత్నాలను రైతాంగం సహించబోదని హెచ్చరించిన అంజయ్య యాదవ్,ఈ విషయంలో ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు,420 హామీలను అమలు చేయడంపై దృష్టి సారించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, ఈట గణేష్, ఎంఎస్ నటరాజన్, లక్ష్మణ్ నాయక్, దేవేందర్ యాదవ్, పెనుముని గోపాల్, చీపిరి రవి యాదవ్,జట్టా కుమార్, యుగంధర్, అశోక్,విశ్వ, రామకృష్ణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ చౌరస్తా విస్తరణ జరగాల్సిందే..!

## మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్‌కు వినతిపత్రం అందజేసిన ఆర్.ఎన్.రాము



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** షాద్‌నగర్ పట్టణంలోని ప్రధాన చౌరస్తా విస్తరణ పనులను వెంటనే చేపట్టాలని కోరుతూ సామాజిక కార్యకర్త ఆర్.ఎన్.రాము, మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణ అభివృద్ధి, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం దృష్ట్యా చౌరస్తా విస్తరణ అత్యవసరమని ఆయన విజ్ఞప్తి చేశారు.వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం,షాద్‌నగర్ పట్టణం రోజురోజుకు విస్తరిస్తుండటంతో పాటు వాహనాల రాకపోకలు గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా జాతీయ రహదారి, బెంగళూరు రహదారి,స్థానిక రోడ్ల నుంచి వచ్చే వాహనాలతో ప్రధాన చౌరస్తా వద్ద తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. చౌరస్తా పరిసర ప్రాంతాల్లో ఉన్న పాత నిర్మాణాలు, ఆక్రమణల కారణంగా రహదారి ఇరుకుగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే అనేక ప్రమాదాలు జరిగి పలువురు చనిపోయారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు ఈ మార్గాన్ని ఉపయోగిస్తున్న నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణతో పాటు చౌరస్తా విస్తరణ పనులను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ మాట్లాడుతూ, షాద్‌నగర్ అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంపై తాము ఎప్పటికప్పుడు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్నామని అన్నారు.గతంలో చౌరస్తా విచితములకు 45 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని అప్పట్లో కొందరు నాయకులు 45 కోట్లు ఏం సరిపోతాయని ప్రకటనలు కూడా చేశారని కొంతమంది కోర్టుకు వెళ్లడం మరి కొంతమంది ఇబ్బందులు సృష్టించడం వల్ల అప్పుడు పనులు చేపట్టలేకపోయారని గుర్తు చేశారు. పట్టణ ప్రజల అవసరాలకు అనుగుణంగా చౌరస్తా విస్తరణ జరగాల్సిన అవసరం ఉందని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంబంధిత అధికారుల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు.షాద్‌నగర్ అభివృద్ధిలో కీలకమైన ఈ సమస్యను ప్రభుత్వం, సంబంధిత శాఖలు అత్యవసరంగా పరిగణించి చర్యలు చేపట్టాలని ఆర్.ఎన్.రాము కోరారు.

# షాద్‌నగర్‌లో మట్టి మాఫియా ఆగడాలు..!

**వందల లారీలతో హైదరాబాద్‌కు విలువైన మట్టి తరలింపు..**

**చెరువులు, పంటకాలువలు కబ్జాలకు గురవుతున్నాయి**

**పోలీసురెవెన్యూ శాఖల మౌనం వెనుక మర్మమేంటి..?**

**షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ ఆగ్రహం..**




**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాద్‌నగర్ నియోజకవర్గంలో మట్టి మాఫియా రెచ్చిపోతోందని, రైతులకు ఉపయోగపడాల్సిన విలువైన మట్టి వందల లారీల ద్వారా హైదరాబాద్‌కు తరలిపోతోందని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ మట్టి తరలింపుపై పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. షాద్‌నగర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వ్యవసాయానికి ప్రధాన ఆధారాలైన చెరువులు, పంటకాలువలు, వాగులు క్రమంగా కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల స్వార్థ ప్రయోజనాల కోసం సహజ నీటి వనరులను ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా బొబ్బిలి చెరువులో రైతులకు ఉపయోగపడే సారవంతమైన ఒండ్రు మట్టిని భారీ ఎత్తున తవ్వి వందలాది లారీల ద్వారా హైదరాబాద్‌కు తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారం అందరికీ కనిపిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అక్రమ మట్టి రవాణా బహిరంగంగా జరుగుతున్నా పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోందని అన్నారు. పెద్ద ఎత్తున జరుగుతున్న ఈ మట్టి దందాపై ఎందుకు కేసులు నమోదు చేయడం లేదని నిలదీశారు. కేశంపేట మండలంలోనూ అధికారులు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపించారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిని వదిలిపెట్టి,తమ సొంత పొలాల్లో వ్యవసాయ అవసరాల కోసం మట్టి పోసుకుంటున్న రైతులను మాత్రమే వేధించడం దురదృష్టకరమని విమర్శించారు. నియోజక వర్గంలోని ఎర్రమట్టి, నల్లమట్టి,విలువైన మొరం వంటి సహజ వనరులు పెద్ద ఎత్తున రాజధాని ప్రాంతానికి తరలిపోతున్నప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. వెంటనే అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, ఈట గణేష్, ఎమ్మెస్ నటరాజన్,లక్ష్మణ్ నాయక్ దేవేందర్ యాదవ్ పెనుముని గోపాల్ చీపిరి రవి యాదవ్ జట్టా కుమార్, యుగంధర్, అశోక్ విశ్వ రామకృష్ణ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనేతరుల పట్టాలతో అక్రమ ఇసుక క్వారీల నిర్వహణ

**1/70 చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ జేబులు నింప్పుతున్న రెవిన్యూ అధికారులు -ఫిర్యాదులు చేసిన పట్టించుకోని అధికార యంత్రాంగం...**

**ఏజెన్సీ చట్టాలకు తూట్లు పొడుస్తున్న అధికారులను మైదాన ప్రాంతాలకు బదిలీ చేయాలి.. తుడుందెబ్బ, -గొండ్వాన సంక్షేమ పరిషత్- డిమాండ్**




**వాజేడు,(ప్రజావినికిడి):**
ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరుల పేర్లతో అక్రమ ఇసుక క్వారీ నిర్వాహణను వెంటనే నిలుపుదల చేయాలని గొండ్వానా సంక్షేమ పరిషత్,ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుం దెబ్బ) డిమాండ్ చేశారు.శనివారం గొండ్వానా సంక్షేమ పరిషత్ తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరుల పట్టా ల్యాండ్స్ లో అక్రమ ఇసుక క్వారీలను నిలుపుదల చేయాలని కోరుతూ డిప్యూటీ తాసిల్దార్ కి వినతి పత్రము అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు పాయిం జానికిరావు,గొండ్వానా సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా అధ్యక్షులు పూనెం ప్రతాప్ మాట్లాడుతూ,ములుగు జిల్లా వాజేడు మండలం ధర్మవరం గ్రామంలో గిరిజనేతరుల అక్రమ పట్టాలతో అక్రమ ఇసుక క్వారీల నిర్వహణ జరుగుతుందని ఇది 1/70 చట్టానికి విరుద్ధమని అన్నారు.ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతలకు వ్యాపారాలు చేయడానికి,ఎలాంటి ప్రోత్సాహం ప్రభుత్వం అందివ్వకూడదని నాయకులు అన్నారు.అలాగే ఇసుక మేటలు తొలగించుటకు ప్రభుత్వం గిరిజనేతరులకు ఇసుక క్వారీలు మంజూరు చేస్తున్నారనీ మండిపడ్డారు. ఇసుక మేటలు తొలగిస్తే వ్యవసాయానికి అనుకూలంగా ఉంటుందో లేదో అని అధికారులు పూర్తి పరిశీలన చేశాకే పర్మిషన్లు ఇవ్వాలని,వ్యవసాయానికి అనుకూలంగా ఉంటేనే పట్టా ల్యాండ్స్ కు ఇసుక తీయటానికి అనుమతులు ఇవ్వాలని అన్నారు.ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ధర్మవరం ఇసుక క్వారీలను నిలుపుదల చేయాలని,చేయకపోతే తుడుం దెబ్బ,గొండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ పట్టా ఇసుక క్వారీల వల్ల ఆదివాసి కుటుంబాలకు ఎలాంటి ఉపాధి ఉండదని ఈ సందర్భంగా తెలియజేశారు.ధర్మవరం ఇసుక క్వారీ వల్ల ఆదివాసులకు ఒరిగేదేమీ లేదని ఇలాంటి అక్రమ ఇసుక క్వారీలకు పర్మిషన్లు,ఎవరైతే ఇసుక కాంట్రాక్టర్లు ఉన్నారో వారిని తరిమికొడతామని ఈ సందర్భంగా హెచ్చరించడం జరిగింది.వెంటనే ప్రభుత్వం ఏదైతే ధర్మవరం ఇసుక వారికి అనుమతులు ఇచ్చిందో వెంటనే వాటిని వెనక్కి తీసుకొని ధర్మవరం ఇసుక క్వారీనీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు సిద్దబోయిన సర్వేశ్వరరావు,గోండ్వానా సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షులు పద్దం సుధాకర్,సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# నాన్న ఎందుకో వెనకబడ్డాడు..!

**మాటల్లో అమ్మ ప్రేమ... మౌనంలో నాన్న త్యాగం.**

**..నాన్నంటే నమ్మకం... నాన్నంటే భరోసా... నాన్నంటే ధైర్యం... నాన్నంటే బాధ్యత.**

**జూన్ 20 (ప్రజావినికిడి):**
అమ్మ ప్రేమ గురించి మాట్లాడినంతగా నాన్న ప్రేమ గురించి మాట్లాడం. తల్లి ప్రేమను అందరూ గొప్పగా కొనియాడతారు. కానీ నాన్న ప్రేమను వ్యక్తపరచడానికి, ఆయనతో ఉన్న అనుబంధాన్ని మాటల్లో చెప్పడానికి ఎందుకో మనసు తడబడుతుంది. అది భయమో, గౌరవమో, ప్రేమో. ఏదో చెప్పలేని భావన.

నిజానికి నాన్న ప్రేమ మాటల్లో కాదు. మౌనంలో వ్యక్తమవుతుంది. నవమాసాలు మోసి మనకు జన్మనిచ్చిన తల్లి ఎంత గొప్పదో, జీవితాంతం తన కలలను త్యాగం చేసి మన కలల కోసం పోరాడే నాన్న కూడా అంతే గొప్పవాడు.

అందుకే ప్రతి సంవత్సరం జూన్ మూడవ ఆదివారం ఫాదర్స్ డేను జరుపుకుంటాం. అది కేవలం ఒక రోజును గుర్తు చేసుకోవడం కాదు. మన జీవితానికి దారి చూపిన వ్యక్తిని స్మరించుకోవడం.


### అమ్మ పరిచయం చేస్తుంది... నాన్న దారి చూపిస్తాడు

అమ్మ మనల్ని ఈ ప్రపంచానికి పరిచయం చేస్తుంది. నాన్న ఈ ప్రపంచంలో ఎలా నిలబడాలో నేర్పిస్తాడు. తల్లి ప్రేమను కళ్లతో చూస్తాం. నాన్న ప్రేమను జీవితాంతం అనుభవిస్తాం.

ఆయన కోపంలో చులకన ఉండదు. బాధ్యత ఉంటుంది. ఆయన మౌనంలో నిర్లక్ష్యం ఉండదు. అపారమైన ప్రేమ దాగి ఉంటుంది.

### తన కలల కంటే మన కలలే ముఖ్యం

తన కలలను పక్కనపెట్టి, పిల్లల కలలను నిజం



చేయడానికి శ్రమించేవాడు నాన్న. అనారోగ్యంతో ఉన్నా పని ఆపడు. బాధలో ఉన్నా బాధ్యతను మరవడు. కుటుంబం సంతోషంగా ఉండాలనే ఒక్క ఆలోచనతో నిరంతరం కష్టపడుతూనే ఉంటాడు. పిల్లల ఎదుగుదలే ఆయన గమ్యం. వారే ఆయన ఆశలు. వారే ఆయన ఆయుష్షు. తన విజయాల కంటే పిల్లల విజయాలకే ఎక్కువగా ఆనందపడే వ్యక్తి నాన్న.



### కనిపించని బలం

వేర్లు కనిపించవు. కానీ చెట్టు నిలబడటానికి అవే ఆధారం. అలాగే కుటుంబానికి కనిపించని బలంగా నిలిచేవాడు నాన్న. పురస్కారాలు రాకపోయినా, గుర్తింపు లేకపోయినా కుటుంబం కోసం అహర్నిశలు శ్రమిస్తూనే ఉంటాడు.

మన విజయాల వెనుక నిలిచే నిశ్శబ్ద శక్తి ఆయనే. నాన్న ఉన్నప్పుడు ఆయన విలువ పూర్తిగా అర్థం కాదు. కానీ ఆయన లేకపోవడాన్ని మాత్రం జీవితం మొత్తం మర్చిపోలేం.

### .నాన్న వెనకబడలేదు... మనమే ఆయనను వెనకబెట్టాం

తల్లి ప్రేమను తరచూ గుర్తు చేసుకుంటాం. నాన్న ప్రేమను మాత్రం చాలా సందర్భాల్లో సహజంగా తీసుకుంటాం. ఆయన తన త్యాగాల గురించి చెప్పుకోడు. తన కష్టాలను బయటపెట్టుకోడు. కానీ ప్రతిరోజూ తన కుటుంబం కోసం, పిల్లల భవిష్యత్తు కోసం నిశ్శబ్దంగా పోరాడుతూనే ఉంటాడు.

అందుకే నాన్న వెనకబడలేదు. మనమే ఆయనను వెనకబెట్టాం. వాట్సాప్ స్టేటస్‌ల్లో అమ్మ ఫోటోలు పెడతాం. నాన్నతో ఫోటో ఎప్పుడు పెట్టాం?

### తల్లిదండ్రులే నిజమైన దేవుళ్లు

తల్లిదండ్రులు తమ కోసం కాదు. పిల్లల కోసం జీవిస్తారు. వారి ఆనందంలోనే తమ ఆనందాన్ని వెతుక్కుంటారు. అలాంటి తల్లిదండ్రులకు ప్రేమ, గౌరవం, ఆదరణ ఇవ్వడం బాధ్యత మాత్రమే కాదు. మన కర్తవ్యం కూడా.

వారిని నిర్లక్ష్యం చేయడం కేవలం ఒక తప్పు కాదు. మనిషితనానికే మాయని మచ్చ. ఫాదర్స్ డే రోజున మాత్రమే కాదు. ప్రతి రోజూ నాన్న ప్రేమను గుర్తుచేసుకుందాం. ఆయన త్యాగాలను గౌరవిద్దాం. ఎందుకంటే మన జీవితంలో కనిపించని హీరో మన నాన్న. ఆయన లేకపోతే మనం లేము. ఆయన లేకపోతే ఈ జీవితం లేదు.

## దూసకల్ గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు..

**ఆరోగ్య వంతమైన జీవితానికి యోగానే పునాది..**





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
యోగ అంటేఒక శారీరక వ్యాయామం,కొన్ని సాధనల మిశ్రమం, కేవలం కొన్ని శారీరక కదలికలు,
శ్వాస ప్రక్రియ మాత్రమే కాదు..యోగ అంటేఒక నిశ్చల మనసునిర్మల సరస్సుసంపూర్ణ ఆత్మధ్యానంఅంతర్లీన మానసిక విజ్ఞానం..పరిపూర్ణ జీవనసార విధానంఅనవరత జ్ఞానమార్గ నిర్మాణంఅనంత మేధాశక్తి, జ్ఞాన శక్తిల సమ్మేళనంశరీరం, మనసు, ఆత్మలను ఏకం చేసే రహస్యం..ప్రాచీన భారతదేశం యొక్క ఆధ్యాత్మిక జ్ఞానంనవీన ప్రపంచానికి నేడొక దివ్యౌషధంశారీరక, మానసిక రుగ్మతలకుఏకైక చికిత్సా విధానం..ప్రాపంచిక జీవనం, పారిమార్థికజీవనాల సమతుల్యతఅశాంతిని దూరం చేస్తేమనసుకు కలిగే ప్రశాంతత..భౌతిక దేహానికి ఆహారం ఎలాంటిదో ఆధ్యాత్మిక జీవనానికి యోగ అలాంటిది..శరీరానికి హృదయం ఎలాంటిదో ప్రశాంత జీవనానికి యోగ అలాంటిది..భారతదేశం ఒక భూభాగమైతే యోగ దాని సారం భారతదేశం శరీరమైతే యోగ దానిలోని ప్రాణం యోగ భారతీయ జీవన దర్శనం..ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలలోప్రైమరీ,స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రేవతి ఉపాధ్యాయులు ,సర్వరాజ్ సార్ సంతోష్ బాబు, శ్రీనివాస్ విద్యార్థి విద్యార్థినిలు పాల్గొన్నవారు.

# కట్లపాములతో చెలగాటం

**ప్రాణం కోల్పోయిన యువకుడు**

**హైదరాబాద్,జూన్20(ప్రజావినికిడి):**
పాముతో చెలగాటం ఓ వ్యక్తి ప్రాణం తీసింది. స్నేహితులను భయపెట్టాలని ఆ వ్యక్తి చేసిన పిచ్చి పని అతని ప్రాణాలను బలితీసుకుంది. ఫామ్‌హౌస్‌లో కనిపించిన కట్లపాము పిల్లను చేతిలో తీసుకుని పరచకాలు ఆడటంతో.. అది కాటువేసింది. దీంతో అతను ప్రాణాలు కోల్పోయాడు. హైదరాబాద్‌లోని మొయినాబాద్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన నవాబ్ జయ్యద్ ఖుమైద్ మొహిద్దీన్ (30) ఒక వ్యాపారవేత్త. తన స్నేహితులతో కలిసి ఇటీవల మొయినాబాద్‌లోని ఒక ఫామ్‌హౌస్‌కు వెళ్లాడు. వారితో సరదాగా గడుపుతున్న సమయంలో అక్కడకు ఒక కట్లపాము పిల్ల వచ్చింది. దాన్ని చూడగానే నవాబ్ దాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు. ఆ పాముతో తన స్నేహితును భయపెట్టాలని అనుకున్నాడు. ఆ కట్ల పాముతో ఆటలు ఆడుతూ స్నేహితులను భయపెట్టబోయాడు. కానీ ఇంతలో కుడి చేతి బొటనవేలుపై కాటేసింది. చిన్న పాము కదా.. పెద్దగా ప్రమాదం ఉండదని వాట్ లైట్ తీసుకున్నాడు. స్నేహితుల ముందు నవ్వుకుంటూ.. తనకు ఎలాంటి ఇబ్బంది లేదని, చికిత్స అవసరం లేదని స్నేహితులతో చెప్పుకొచ్చాడు. కానీ చిన్నదైనా, పెద్దదైనా కట్లపాము విషం అత్యంత ప్రమాదకరమేని అతను తెలుసుకోలేకపోయాడు. ఇంకేముంది.. కొద్దిసేపట్లోనే కట్ల పాము విషం నవాబ్ శరీరంపై ప్రభావం చూపడం మొదలుపెట్టింది. ముందుగా శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారింది. క్రమంగా ఆరోగ్యం కూడా క్షీణించింది. దీంతో ఆందోళన చెందిన స్నేహితులు నవాబ్‌ను వెంటనే ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అప్పటికే విషం శరీరం మొత్తం పాకడంతో నవాబ్ కన్నుమూశాడు. కాగా, దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది.

# చిట్టీల వ్యాపారం చేస్తున్న టీచర్ సస్పెన్షన్

**హన్మకొండ,జూన్20(ప్రజావినికిడి):** చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్న గవర్నమెంట్ టీచర్‌పై వేటుపడింది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి జడ్పీ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కలువల ఎల్లయ్యను సస్పెండ్ చేశారు. ఈ మేరకు డీఈవో గిరిరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు చిట్టీల వ్యాపారం నిర్వహిస్తూ, మోసాలకు పాల్పడుతున్నాడని ఇటీవల కలువల ఎల్లయ్యపై ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఆరోపణలపై విచారణ కోసం కలెక్టర్ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ జరిపిన ప్రాథమిక విచారణలో నేరం రుజువు కావడంతో డీఈవో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.

# అన్నివర్గాలను మోసం చేసిన కాంగ్రెస్

**కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శలు**

**హైదరాబాద్,జూన్20(ప్రజావినికిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద తీవ్రంగా మండిపడ్డారు. ప్రజలను నానాయాతన పెడుతూ రాష్ట్రాన్ని పూర్తిగా అధోగతి పాలు చేస్తుందని విమర్శించారు. హైదరాబాద్ చింతల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఉదయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేపీ వివేకానంద మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ది పేరుకే ప్రజాపాలన.. వాస్తవానికి ప్రజలను హింసించే పాలనగా సాగుతుందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాక్షస పాలన సాగుతోందని ఆరోపించారు.పదేళ్ల పాటు కేసీఆర్ పాలనలో వ్యవసాయాన్ని ఒక పండుగలా మార్చారని కేపీ వివేకానంద తెలిపారు. రైతులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, కడుపులో పెట్టుకుని చూసుకున్నారని కొనియాడారు. సకాలంలో విత్తనాలు, యూరియా అందించడమే కాకుండా, సమయానికి 'రైతు బంధు' డబ్బులను నేరుగా రైతుల ఖాతాల్లో వేసి, పండించిన ప్రతి ధాన్యాన్ని కొనుగోలు చేసి అన్నదాతకు బంగారు బాట వేశారని పేర్కొన్నారు. కానీ నేడు రేవంత్ రెడ్డి రాక్షస పరిపాలనలో రైతులంతా హింసను అనుభవిస్తున్నారని, రైతులకు నరకం చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయానికి విత్తనాలు లేవు, యూరియా కోసం రైతులు రోడ్లపై పడిగాపులు కాస్తూ యుద్ధాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పేరు మార్చి రైతు భరోసా అని పెట్టారని.. కానీ అది భరోసా కాదు.. రైతు మోసం అని అన్నారు. రైతు భరోసా కింద ఒక్క రైతుకు కూడా డబ్బులు ఇవ్వలేదని విమర్శించారు.

సంపూర్ణ రుణమాఫీ చేస్తానని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని కేపీ వివేకానంద మండిపడ్డారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బోరంపేట పీఏసీఎస్ పరిధిలో 632 మంది రైతులకు కేవలం 13 మందికే రుణమాఫీ అయ్యిందని తెలిపారు. రుణమాఫీ విషయంలో రేవంత్ రెడ్డి గజదొంగలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం వడ్లు కొనకపోతే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయదా అని పీసీసీ ప్రెసిడెంట్‌గా ఉన్న సమయంలో రేవంత్ రెడ్డి ప్రశ్నించారని గుర్తుచేశారు. కేంద్రం వడ్లు కొనుగోలు చేయకపోతే కిషన్ రెడ్డి ఇంటి ముందు వడ్లు పోస్తానని శపథం చేసిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు మోదీకి సరెండర్ అయిపోయాడని విమర్శించారు. రేవంత్ రెడ్డి చేతగానితనాన్ని, డొల్లతనాన్ని, అసమర్థను ఆయన ప్రకటనలే బయటపెడుతున్నాయని అన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో రైలు విస్తరణ, ఫోర్త్ సిటీ, కాళేశ్వరం రిపేర్లు ఇలా ప్రతిదాంట్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని అన్నారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై దుమ్మెత్తిపోస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ మోసాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని.. ఈ చేతగాని ప్రభుత్వాన్ని గద్దె దించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గులాబీ జెండా ఎగురడం, మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రైతాంగానికి చేసిన మోసానికి కాంగ్రెస్ ప్రభుత్వం ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తక్షణమే రైతు బీమా ప్రీమియం చెల్లించాలని, రైతు భరోసా కింద ఎకరానికి రూ.15వేలను రైతుల ఖాతాలో జమ చేయాలలన్నారు. లేదంటే అసెంబ్లీ వేదికగానే కాకుండా, రోడ్లపైకి వచ్చి ప్రజా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి సర్కార్ మెడలు వంచైనా రైతుల హక్కులను సాధించుకుంటామని స్పష్టం చేశారు.


# సంపూర్ణ ఆరోగ్య ప్రక్రియ యోగా...!



## నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం



**జూన్ 20:(ప్రజావినికిడి):**
మన రుషులు అందించకినే అద్భుత ఆరోగ్య ప్రక్రియ యోగా. ఆధునిక కాలంలో మనమంతా చేస్తున్న కసరత్తులకు పూర్వమే రుషులు యోగా ద్వారా మన శరీరాన్ని అదుపులో పెట్టుకోవడమెలాగో ఆచరించి చూపారు. వేల ఏళ్ళుగా ఈ యోగా అన్నది ఆనాటి దినచర్యలో భాగం. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని నిరూపితం అయ్యింది. ఇతర వ్యాయామాకంటే భిన్నమైన యోగాభ్యాసము దానిలో నిబిడీకృతంగా ఉన్న ఆద్యాత్మిక భావం కారణంగా దేశవిదేశాలలో విశేషప్రాచుర్యాన్ని సంతరించుకున్నది.ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నానుడికి యోగా పరమౌషధం.



యోగా చేసేవారిలో ధృఢత్వం, మానసిక ప్రశాంతతను గమనించవచ్చు. ముఖ్యంగా పాశ్చాత్యదేశాల యోగా ప్రాచుర్యము, ఆదరణ అమోఘమైనది. పాశ్చాత్య దేశీయులకు యోగా మీద ఉన్న విశేషమైన మక్కువ, ఆకర్షణ లోక విదితం. బుద్ధ ఆరామలాలో ఇచ్ఛేశిక్షణలో యోగా కూడా ఒక భాగమే. వారి వేషధారణ క్రమశిక్షణ ప్రపంచ ప్రాముఖ్యత ఆకర్షణ సంతరించుకున్నది. భారతీయ సంప్రదాయిక యోగశిక్షణా తరగతులను అనేక దేశాలలో నిర్వహిస్తున్నారు. ఇతర వ్యాయాయములు శరీరదారుఢ్యాన్ని మాత్రమే మెరుగు పరచడములోదృష్టిని సారిస్తాయి. యోగా భ్యాసము ధ్యానం, ప్రాణాయామం లాంటి పక్రియలు మానసిక ఏకాగ్రత వలన మానసిక ప్రశాంతతను కలిగించి మానసిక ఆరోగ్యానికి కూడా దోహద పడుతుంది. మానసిక వత్తిడులు, హృద్రోగము, రక్తపోటు లాంటి వ్యాధుల తీవ్రత తగ్గించటానికి తోడ్పడుతుందని ప్రయోగాత్మకంగా యోగా నిరూపించింది. సనాతన సంప్రదాయమైన యోగా అధునిక కాలంలో కూడా అనేకమంది అధునికుల అభిమానాన్ని చూరగొన్నది. ప్రధాని మోడీ చొరవతో ఐక్యరాజ్య సమితి జూన్ 21న యోగా దినోత్సవం జరుపుకోవడానికి అంగీకరిం చింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా 21న అంతర్జాతీయ యోగా జరుపుకుంటున్నాం. ఇది భారతీయులకు గర్వకారణంగా చెప్పుకోవాలి. జూన్ 21 ఉత్తరార్థగోళంలో అత్యధిక పగటి సమయం ఉన్న రోజు. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో ఆ రోజుకు ప్రత్యేకత కూడా ఉంటుంది. ఎక్కువ పగటి సమయం ఉన్న రోజుగా గుర్తింపు పొందడంతో అదే రోజును అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితికి ప్రధాని మోదీ సూచించారు. దీంతో అంతర్జాతీయ యోగ దినోత్సవము ప్రతి సంవత్సరం జూన్ 21 న జరుపడానికి నిశ్చయించారు. 2014 సెప్టెంబరు 27న భారత ప్రధాని నరేంద్రమోడి ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుకొనుట గురించి ప్రతిపాదన చేశారు. ఈ తీర్మానానికి 193 ఐరాస ప్రతినిధులలో 175 మంది మద్దతు ఇచ్చారు. భద్రతా కమిషన్‌లో శాశ్వత సభ్యులుగా ఉన్న భారతదేశం, అమెరికా, ఇంగ్లాండ్, చైనా, ఫ్రాన్స్, రష్యా వంటి దేశాలు కూడా ఈ తీర్మానానికి సహ ప్రతినిధులు. విస్తృతమైన చర్చల తరువాత డిసెంబర్ 2014 లో ఆమోదించబడింది. 2015 జూన్ 21 న, మొదటి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకున్నారు. మన యోగా గురించి వేల ఏళ్ల క్రితం ఆచారంలో ఉన్నట్లు పురాణాలు, ఇతిహాసాల్లో ఉంది. ఈశ్వరుడు తపస్సు చేస్తున్నప్పుడు పద్మాసనంలో ధ్యానయోగంలో ఉన్నట్లు పురాణాలలో వర్ణించబడి ఉంది. లక్ష్మీదేవి ఎప్పుడు పద్మాసినియే, మహా విష్ణువు నిద్రను యోగనిద్రగా వర్ణించబడింది. తాపసులు తమ తపసును పద్మాసనంలోనే చేసినట్లు పురాణ వర్ణన. ఇంకా లెక్కకు మిక్కిలి ఉదాహరణలు హిందూ సంప్రదాయంలో చోటు చేసుకున్నాయి. బుద్ధ సంప్రదాయంలో, జైన సంప్రదాయం లోను, సన్యాస శిక్షణలోను యోగా ప్రధాన పాత్ర పోషిస్తుంది. సింధు నాగరికత కుడ్య చిత్రాల ఆధారంగా యోగా వారి నాగరికతలో భాగంగా విశ్వసిస్తున్నారు. 11 వ శతాబ్దమున ఘూరఖ్ నాద్ శిశ్యుడగు స్వామి స్వాత్వారామ ముని హఠయోగం అను యొగ శాస్త్ర గ్రంథం వ్రాసి యున్నారు. ఇందులో ఆసనములను, ప్రాణాయామ పద్ధతులను, బంధములను, ముద్రలను, క్రియలను సవిస్తారముగ వ్రాసి యున్నారు. అనేక వేల ఆసనములలో 84 ఆసనములను ముఖ్యమైనవిగా చెప్పబడినవి. ముఖ్యముగ ధ్యానమునకు కావలసిన సుఖాసనము, సిద్దాసనము, అర్ధ పద్మాసనము, పద్మాసనములు ముఖ్యమని చెప్ప బడింది. ఇదె విధముగ పాతంజలి యొగ శాస్త్రమున - స్థిరసుఖ మాసనమ్- అని ఆసనము నకు నిర్వచనము ఉంది. ప్రాణాయామ సాధనలో - సూర్య భేదన, ఉజ్జాయి, శీతలి, సీత్కారి, భస్త్రిక, భ్రామరి, ప్లావని, మూర్ఛ - ఇతి అష్ట కుంభకాని వంటి 8 ప్రాణాయమములు చెప్ప బడెను. జాలంధర బంధము, మూల బంధము, ఉడ్యాన బంధము - ఈ మూడు బంధములు ముఖ్యమని చెప్పబడెను. ముద్రలలో మహాముద్ర, మహాబంధ, మహాభేధ - ముఖ్య మగు ముద్రలుగ చెప్ప బడెను. శరీరమునకు బహిర్ అంతర్ శుచి చాల అవసరముగ ఈ హఠయొగమున ప్రధాన అంశముగ చెప్పబడింది.-ధవుతి, నేతి, వస్తి, నౌలి, త్రటకం, తధా కఫాల భాతి ఏతాని షట్ కర్మాణి - అని వివరణగలదు.. అంటే యోగాలో ఏయే ఆసనం వేస్తే..ఏయే అవయవం బాగా పనిచేస్తుందన్న విషయం దాగివుంది. అందుకే శరీరాన్ని మన అదుపులో ఉంచుకుని శారీరక, మానసిక ప్రశాంతతను పొంతేందుకు చేసే విధానమే యోగ. యోగతో ఆరోగ్యం మన స్వాధీనంలో ఉంటుంది. శ్వాస ప్రక్రియ వలన ఆరోగ్యం స్థిరంగా ఉంటుంది. అలాగే మన జఠరం బాగా పనిచేసి అవయవాలు పనిచేయ డానికి దోహదపడుతుంది. ఇలాంటి యోగను ఏటా అంతర్జాతీయంగా జరుపుకోవాలన్న నిర్ణయం వల్ల ఇప్పుడు ప్రపంచ దేశాల్లో యోగా ప్రాముఖ్యతను గుర్తించారు. మన నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకుంటే ఆరోగ్యం మన అదుపులో ఉంటుంది. శరీరం అదుపులో ఉంటుంది. దీనిని ప్రతి ఒక్కరూ భాగం చేసుకుంటే జీవితం

## రాష్ట్రపతి ద్రౌపది ముర్మ జన్మదినోత్సవం

### ఎక్స్ వేదికగా సిఎం చంద్రబాబు, పవన్ శుభాకాంక్షలు

**అమరావతి,జూన్ 20:(ప్రజావినికిడి):**



శనివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పుట్టినరోజు సందర్భంగా రాష్ట్రపతికి రాజకీయ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బర్త్ డే విషెస్ తెలియజేశారు. దేశానికి ద్రౌపది ముర్ము అందిస్తున్న సేవల్లో విజయం సాధించాలని సీఎం ఆకాంక్షించగా, నాయకులు కావాలనుకునే ప్రతి ఒక్కరికీ రాష్ట్రపతి ముర్ము నిజమైన స్ఫూర్తిదాయకమని పవన్ అన్నారు. 'భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు జన్మదిన శుభాకాంక్షలు. ఆమె జీవితం, ప్రజాసేవ దేశవ్యాప్తంగా లక్షలాది మందికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. ద్రౌపది ముర్ము మంచి ఆరోగ్యంతో ఉండాలని, దేశానికి ఆమె అందిస్తున్న గొప్ప సేవల్లో విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాను' అంటూ చంద్రబాబు పోస్ట్ చేశారు. 'రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు. నగర్ పంచాయతీ కౌన్సిలర్‌గా సేవలందించడం నుంచి భారతదేశ ప్రథమ పౌరురాలిగా ఎదిగే వరకూ.. ఆమె సాగించిన అద్భుత ప్రయాణం, ప్రజాసేవకులు, నాయకులు కావాలనుకునే ప్రతి ఒక్కరికీ నిజమైన స్ఫూర్తిదాయకం. ఇది అట్టడుగు స్థాయి ప్రజాస్వామ్య బలానికి, అంకితభావంతో కూడిన ప్రజాసేవ శక్తికి నిదర్శనంగా నిలుస్తుంది. దేశ సేవలో ఆమెకు మంచి ఆరోగ్యం, దృఢత్వం, దీర్ఘాయుష్షును ప్రసాదించాలని జగన్నాథ స్వామిని ప్రార్థిస్తున్నాను' అంటూ ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## బంగ్లాదేశ్‌లో మళ్లీ ఉద్రిక్తతలు

### శ్రీరాముడి చిత్రంపై చెప్ప -నిరసనగా ఢాకాలో హిందువుల భారీ ర్యాలీ

**ఢాకా,జూన్ 20: (ప్రజావినికిడి):**



బంగ్లాదేశ్‌లో మళ్లీ ఉద్రిక్తతలు చెలరేగాయి. శ్రీరాముడి చిత్రంపై చెప్పు ఉంచి తమ మతవిశ్వాసాలను అవమానించారంటూ రాజధాని ఢాకాలో హిందువులు కాగడాలు, కొవ్వొత్తులతో శుక్రవారం రాఇత్రి భారీ ర్యాలీ నిర్వహించారు. జై శ్రీరామ్ అంటూ పెద్ద ఎత్తున నినదించారు. ఉత్తర గాయిబంద జిల్లాలో శ్రీశ్రీ రాధాగోవింద దేవాలయ కమిటీ 81 అడుగుల శ్రీరాముడి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు రంగంలోకి దిగింది. అయితే, అతివాదుల నుంచి బెదిరింపులు రావడంతో కార్యక్రమం వాయిదా పడింది. ఈ నేపథ్యంలో తాజాగా కొందరు అవమానకర చర్యలకు దిగడంతో పరిస్థితి మరోసారి ఉద్రిక్తంగా మారినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో ఢాకాలో వేల మంది హిందువులు నిరసనకు దిగారు. పలు హిందూ సంఘాల ఆధ్వర్యంలో జై శ్రీరామ్ అని నినదిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి తరలి రావాలన్న హిందూ మహాజ్యోత్ సంస్థ పిలుపు మేరకు శుక్రవారం సామాన్య ప్రజలు, ఇతర హిందూ సంఘాలు షహబాగ్ కూడలికి పెద్ద సంఖ్యలో వచ్చారు. అక్కడి నుంచి నేషనల్ ప్రెస్ క్లబ్ వరకూ ర్యాలీగా వెళ్లారు. ప్రెస్‌క్లబ్ ముందు భారీ మానవహారంతో నిరసన తెలిపారు. మరికొంత మంది ఢాకా రిపోర్టర్స్ యూనిటీ భవనం ముందు నిరసన చేపట్టారు. రంగపూర్‌లో నిరసన తెలిపిన వారిని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్తతలు పెరిగాయి. మైనారిటీలు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం మౌనంగా ఉంటోందని నిరసనకారులు ఆరోపించారు. తమ మతవిశ్వాసాలను అవమానించిన వారిని 72 గంటల్లోగా అరెస్టు చేయాలని అల్టిమేటమ్ జారీ చేశారు. లేని పక్షంలో నిరసనలు మరింత తీవ్రమవుతాయని హెచ్చరించారు.

## నీట్ అడ్మిట్ కార్డుల్లో లోపాలు

### మహారాష్ట్ర విద్యార్థికి అరబ్ ఎమిరేట్స్ సెంటర్

### ఖంగుతిన ఎటిఎకు సమాచారం ఇచ్చిన విద్యార్థి

### పొరపాటును సవరించి, కొత్త కేంద్రం అలాట్‌కు హామీ

**న్యూఢిల్లీ,జూన్ 20: (ప్రజావినికిడి):**
నీట్ రీ-ఎగ్జామ్‌కు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జారీ చేసిన అడ్మిట్ కార్డులో లోపాలు బయటపడ్డాయి. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన ఓ అభ్యర్థికి.. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అబుధాబీలో పరీక్షా కేంద్రాన్ని కేటాయించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై స్పందించిన ఎన్‌టీఏ.. సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపింది పరీక్షకు ఒకరోజు ముందు ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. నీట్ రీటెస్టుకు సమయం దగ్గరపడుతోన్న నేపథ్యంలో అబ్దుల్లా మహ్మద్ తాలిబ్ అనే అభ్యర్థి.. శుక్రవారం సాయంత్రం తన అడ్మిట్ కార్డును డౌన్‌లోడ్



చేసుకున్నాడు. అందులో పరీక్షా కేంద్రాన్ని చూసి అవాక్కయ్యాడు. అబుధాబీలోని ఓ భారతీయ స్కూల్‌లో ఎన్‌టీఏ అతడికి పరీక్షా కేంద్రాన్ని కేటాయించింది. ఈ అడ్మిట్ కార్డుకు సంబంధించిన ఫొటో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. తాము ఇచ్చిన ఆప్షన్లలో అలాంటి కేంద్రం ఏదీ లేదని విద్యార్థి తండ్రి మీడియాతో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎన్‌టీఏ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటల్లోపు కొత్త అడ్మిట్ కార్డు జారీ చేస్తామని తమకు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. సమయం తక్కువగా ఉన్నందున నాగ్‌పూర్‌నే పరీక్షా కేంద్రంగా కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సంఘటనతో తన కొడుకు తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు తెలిపారు. ఈ సమస్యపై ఎన్‌టీఏ కూడా స్పందించింది. సాంకేతిక లోపం వల్ల ఇలా జరిగినట్లు పేర్కొంది. సమస్యను పరిష్కరిస్తున్నామని.. కొన్ని గంటల్లోనే ఆ విద్యార్థికి పరీక్షా కేంద్రాన్ని కేటాయిస్తామని స్పష్టంచేసింది. కాగా.. అడ్మిట్ కార్డులో వ్యక్తిగత వివరాలు, పరీక్ష కేంద్రాలు ఇతర ముఖ్యమైన అంశాల్లో ఏమైనా లోపాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఈసందర్భంగా ఎన్‌టీఏ అభ్యర్థులకు సూచించింది. ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో రద్దయిన నీట్ ఎంట్రన్స్ పరీక్షను నేడు మరోసారి నిర్వహించనున్న విషయం తెలిసిందే. రీ-నీట్ అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్ చేసుకుని చూస్తే జరిగిన పొరపాటు గురించి తెలిసిందని అబ్దుల్లా మొహమ్మద్ తాలిబ్ అనే విద్యార్థి తెలిపాడు. తాను భారత్‌లో ఉంటే తన పరీక్ష కేంద్రం మాత్రం యూఏఈలో ఉన్నట్టు అడ్మిట్ కార్డులో కనిపించిందని అన్నాడు. నాగ్‌పూర్‌లో పరీక్ష కేంద్రం కోసం అతడు దరఖాస్తు చేసినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ విషయం ఎన్‌టీఏ దృష్టికి తీసుకెళ్లగా సాంకేతిక సమస్య కారణంగా ఇలా జరిగిందని సంస్థ తెలిపినట్టు విద్యార్థి తండ్రి తెలిపారు. సమస్యను పరిష్కరిస్తామని, సవరించిన అడ్మిట్ కార్డును జారీ చేస్తామని పేర్కొన్నట్టు చెప్పారు. ఈ మేరకు ఎన్‌టీఏ నుంచి ఈమెయిల్ వచ్చిందని వెల్లడించారు.ద

## ఏపీ, తెలంగాణకు భారీ వర్ష సూచన..

### ఉరుములు, పిడుగులతో ముంచెత్తనున్న వానలు

**జూన్ 20:(ప్రజావినికిడి):**
తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం ఎప్పుడు ఎలా మారుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే రుతుపవనాలు ఎంట్రీ ఇచ్చినా, అక్కడక్కడ మాత్రమే వర్షాలు కురిశాయి.. అయితే, నేటి నుంచి వాతావరణం పూర్తిగా చల్లబడనుందని, ఇరు రాష్ట్రాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.
ఏపీలోని ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలపై వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండబోతోంది. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, విశాఖపట్నం, గుంటూరు, పల్నాడు, ప్రకాశం,



నెల్లూరు, కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వానలు కురుస్తాయి.
తెలంగాణలో నేడు ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా సెంట్రల్, దక్షిణ తెలంగాణ జిల్లాలపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, మెదక్, సిద్దిపేట్, మహబూబ్ నగర్, వనపర్తి, నాగర్ కర్నూల్, నారాయణ్ పేట్, నల్గొండ, యాదాద్రి భువనగిరి, జనగాం, కామారెడ్డి జిల్లాల్లో సాయంత్రం నుండి అర్ధరాత్రి సమయంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.
హైదరాబాద్‌లో కూడా పగటిపూట ఎండ ఉన్నప్పటికీ.. రాత్రి సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయి ఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలు పడే ముప్పు ఉందని వెదర్ రిపోర్ట్స్ చెబుతున్నాయి.

# ఆఫ్ఘన్‌పై భారత్ భారీ విజయం..

## 9 వికెట్ల తేడాతో ఆఫ్ఘన్ చిత్తు
## 3-0తో భారత్ సిరీస్ క్లీన్ స్వీప్



చెన్నైలోని ఎం.ఏ. చిదంబరం స్టేడియంలో జరిగిన 3వ వాణ×లో భారత్ తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. అఫ్గానిస్తాన్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నా, ప్రసీధ్ కృష్ణ అద్భుత బౌలింగ్‌తో వారిని 218 పరుగులకు ఆలౌట్ చేసింది. భారత్ లక్ష్యాన్ని 28.4 ఓవర్లలోనే 224/1తో చేజ్ చేసి 9 వికెట్ల తేడాతో గెలిచి సిరీస్‌ను 3-0తో ముగించింది. ఇది అఫ్గానిస్తాన్‌పై భారత్ బలమైన ప్రదర్శనను మరోసారి నిరూపించింది. మ్యాచ్ ప్రారంభంలో అఫ్గానిస్తాన్ బ్యాటింగ్ దుర్వినియోగమైంది. ప్రసీధ్ కృష్ణ మొదటి ఓవర్‌లోనే రహ్మానుల్లా గుర్బాజ్‌ను (5) ఔట్ చేశాడు. రోహిత్ శర్మ స్లిప్‌లో అద్భుత క్యాచులు పట్టి మూడు వికెట్లు సహకరించాడు. ఇబ్రాహిం జాద్రాన్ (11), రహ్మత్ షా (5), దర్వీష్ రసూలి త్వరగా పెవిలియన్ చేరారు. అఫ్గానిస్తాన్ 9.2 ఓవర్లలో 36/4కి కుప్పకూలింది. ఈ సమయంలో కెప్టెన్ హష్మతుల్లా షాహిది మరియు అజ్మతుల్లా ఒమర్జాయ్ భాగస్వామ్యం కీలకమైంది. ఒమర్జాయ్ అర్ధ శతకం (50) సాధించగా, షాహిది తన మైడెన్ వన్డే సెంచరీ (102 బాల్స్‌లో 102 పరుగులు, 13 ఫోర్లు, 1 సిక్స్)తో జట్టును 218 వరకు తీసుకెళ్లాడు. ప్రసీధ్ కృష్ణ 8.2 ఓవర్లలో 23 పరుగులకు 5 వికెట్లు సాధించి మ్యాచ్‌ను తన వశం చేసుకున్నాడు. ఇతర బౌలర్లు కూడా సహకరించారు. ఛేజింగ్‌లో భారత్ ఓపెనర్లు యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ అద్భుతంగా ఆడారు. రోహిత్ 79 పరుగులు చేసి ఔట్ అయ్యాడు కానీ జైస్వాల్ సెంచరీ సాధించి అజేయంగా నిలిచాడు. భారత్ 28.4 ఓవర్లలో 224/1తో లక్ష్యం చేరుకుంది. ఈ విజయంతో భారత్ వాణ× సిరీస్‌ను 3-0తో గెలిచి ఆధిపత్యం చాటింది. షుబ్‌మన్ గిల్ నాయకత్వంలో జట్టు డెప్త్‌ను ప్రదర్శించింది. నితీష్ కుమార్ రెడ్డీ, హర్ష్ దుబే, ప్రసీధ్ కృష్ణ వంటి ఆటగాళ్లు అవకాశాలు సద్వినియోగం చేసుకున్నారు. ఈ సిరీస్ భారత్ క్రికెట్ బలాన్ని మరోసారి హైలైట్ చేసింది. అఫ్గానిస్తాన్ షాహిది సెంచరీతో పోరాడినా, బౌలింగ్ బలహీనతలు వారిని ఓడించాయి. చెన్నై పిచ్ స్పిన్, పేస్‌కు సపోర్టు ఇచ్చింది. భారత్ బౌలర్లు డెత్ ఓవర్లలో కూడా నియంత్రణ కాపాడారు. ఈ మ్యాచ్ యువ ఆటగాళ్ల అవకాశాలు, జట్టు డెప్త్‌ను చూపించింది. క్రికెట్ ప్రేమికులు ఈ విజయాన్ని సంబరాలతో జరుపుకుంటున్నారు. భారత్ ఈ సిరీస్ గెలుపుతో 2027 ప్రపంచ కప్ సన్నాహాలను మరింత బలోపేతం చేసుకుంది. అఫ్గానిస్తాన్ తమ అనుభవాన్ని మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉంది. రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్ ఓపెనింగ్ భాగస్వామ్యం, ప్రసీధ్ బౌలింగ్ మరపురాని ముద్ర వేశాయి. ఈ మ్యాచ్ క్రికెట్ అభిమానులకు ఉత్కంఠభరితమైనదిగా మారింది. ఈ విజయం భారత్ క్రికెట్ భవిష్యత్తును ఉజ్వలంగా చూపిస్తుంది. యువ ఆటగాళ్లు అంతర్జాతీయ స్థాయిలో రాణించడం గ్రేట్. అఫ్గానిస్తాన్ జట్టు కూడా తమ సామర్థ్యాలను మెరుగుపరచుకుని భవిష్యత్ మ్యాచ్‌లలో మెరుగైన ప్రదర్శన ఇవ్వాలని కోరుకుందాం. మొత్తం సిరీస్ భారత్ ఆధిపత్యంతో ముగిసింది.

# చెపాక్‌లో శతక్కొట్టిన జైశ్వాల్..



చెన్నై వేదికగా శనివారం జరిగిన మూడో వన్డేలో అఫ్ఘానిస్థాన్‌పై 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన భారత్, మూడు వన్డేల సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. తొలుత ప్రసిద్ధ్ కృష్ణ ధాటికి అఫ్ఘాన్ 218 పరుగులకే ఆలౌట్ కాగా, కెప్టెన్ షాహిదీ (102) సెంచరీతో రాణించాడు. అనంతరం 219 పరుగుల లక్ష్యాన్ని భారత్ కేవలం ఒక్క వికెట్ కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ యశస్వి జైశ్వాల్ (110 నాటౌట్) అద్భుత సెంచరీ సాధించగా, రోహిత్ శర్మ 79 పరుగులతో రాణించాడు.న్నై వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన అఫ్ఘాన్ కెప్టెన్ తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అయితే ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్ వేయడం.. అఫ్ఘాన్ బ్యాటర్లు షాట్లు కొట్టడం.. బంతి వెళ్లి నేరుగా రోహిత్ శర్మ చేతిలో పడటం. వరుసగా మూడు వికెట్లు ఇదే తరహాలో పడ్డాయి. రెహ్మనుల్లా గుర్బాజ్, ఇబ్రహీం జద్రాన్, రెహ్మత్ షా.. ముగ్గురు ప్రసిద్ధ్ బౌలింగ్‌లో రోహిత్ శర్మకు క్యాచ్ ఇచ్చి ఔట్ అయ్యారు. డార్విష్ రసూల్ కూడా ఔట్ కావడంతో అఫ్ఘాన్.. 36/4తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ సమయంలో కెప్టెన్ హష్మతుల్లా షాహిదీ (102), అజ్మతుల్లా ఒమర్జాయ్ (50) ఆదుకున్నారు. కానీ వారిద్దరూ ఔట్ అయ్యాక అఫ్ఘాన్ కుప్పకూలింది. ప్రసిద్ధ్ కృష్ణ ఐదు వికెట్లు తీశాడు.అనంతరం ఛేజింగ్ ప్రారంభించిన భారత ఓపెనర్లు అఫ్ఘాన్ బౌలర్లు ఏమాత్రం ఇబ్బంది పెట్టలేకపోయారు. ఈ క్రమంలోనే రోహిత్, జైశ్వాల్.. ఇద్దరూ హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. తొలి వికెట్‌కు 137 బంతుల్లో 170 రన్స్ జోడించారు. 69 బంతుల్లో 79 రన్స్ చేసి రోహిత్ శర్మ ఔట్ అయినా.. జైశ్వాల్ మాత్రం జోరు కొనసాగించాడు. ఈ క్రమంలోనే తన కెరీర్‌లో రెండో వన్డే సెంచరీ కొట్టాడు. సిక్సర్‌తో మ్యాచ్ ముగించాడు. 86 బంతుల్లో 110 రన్స్ చేసి అజేయంగా నిలిచాడు. శ్రేయస్ అయ్యర్ 19 బంతుల్లో 20 రన్స్ చేసి నాటౌట్‌గా ఉన్నాడు.

# 14000 పరుగుల క్లబ్‌లోకి జో రూట్



న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ టెస్ట్ క్రికెట్‌లో 14,000 పరుగుల మైలురాయిని అందుకుని చరిత్ర సృష్టించాడు. సచిన్ టెండూల్కర్ (15,921) తర్వాత ఈ అరుదైన ఫీట్ సాధించిన రెండో బ్యాటర్‌గా రూట్ రికార్డులకెక్కాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో వన్డేలో అతడు ఈ ఫీట్ సాధించాడు. ప్రస్తుతం 35 ఏళ్ల జో రూట్, సచిన్ ఆల్‌టైమ్ రికార్డును బద్దలు కొట్టడానికి మరో 1,921 పరుగుల దూరంలో ఉన్నాడు. ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ .. టెస్టుల్లో 14,000 పరుగుల మైలురాయిని చేరాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో రెండు పరుగులు చేయడం ద్వారా అతడు ఈ ఫీట్ సాధించాడు. దీంతో టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఈ ఫీట్ సాధించిన రెండో క్రికెటర్‌గా అతడు నిలిచాడు. ఈ క్రమంలోనే టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక రన్స్ చేసిన వ్యక్తిగా ఉన్న సచిన్ టెండూల్కర్ రికార్డుకు రూట్ చేరువయ్యాడు. సుమారుగా మరో 1800o రన్స్ చేస్తే.. రెడ్ బాల్ క్రికెట్‌లో అత్యధిక రన్స్ చేసిన ప్లేయర్‌గా రూట్ అవతరిస్తాడు.టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక రన్స్ చేసిన ప్లేయర్‌ల జాబితాలో భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ అగ్రస్థానంలో ఉన్నాడు. అతడు తన టెస్ట్ కెరీర్‌లో 15,921 పరుగులు సాధించాడు. సచిన్ 2010లో ఈ ఫీట్ సాధించాడు. అయితే ఈ రికార్డు ఎప్పటికీ చెరిగిపోదని అంతా భావించారు. టెస్ట్ క్రికెట్‌కు ఆసక్తి తగ్గుతున్న ప్రస్తుత రోజుల్లో సచిన్ రికార్డు చెక్కు చెదరకుండా ఉంటుందనే విశ్లేషణలు వినిపించాయి. కానీ రెడ్ బాల్ క్రికెట్ అంటే ఆసక్తిచూపించే ఇంగ్లాండ్‌లో పుట్టిన జో రూట్.. ఈ ఫార్మాట్‌కు ప్రాణం పోస్తున్నాడు. పరుగుల వరద పారిస్తూ.. సచిన్ రికార్డును డేంజర్‌లో పెట్టాడు. 35 ఏళ్ల జో రూట్.. సచిన్ రికార్డు బద్దలు కొట్టేందుకు 1921 పరుగుల దూరంలో ఉన్నాడు.విరాట్ కోహ్లీ తన టెస్ట్ కెరీర్‌లో 9230 పరుగులు సాధించాడు. కేన్ విలియమ్సన్ 9515 పరుగులు స్కోరు చేశాడు.

# ఆస్ట్రేలియాపై అమెరికా విజయదుందుభి



ఫిఫా ప్రపంచకప్ 2026 ఆతిథ్య దేశాల్లో అమెరికా ఫుట్‌బాల్ జట్టు విజయదుందుభి మోగించింది. శుక్రవారం జరిగిన గ్రూప్-డి పోరులో అమెరికా 2-0 గోల్స్ తేడాతో ఆస్ట్రేలియాను ఓడించింది. ఈ విజయంతో టోర్నమెంట్‌లో వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. దీంతో అమెరికా నాకౌట్ దశకు అర్హత సాధించింది. అమెరికా జట్టు గ్రూప్ దశలో ఇంకా ఒక మ్యాచ్ మిగిలి ఉండగానే నాకౌట్ బెర్త్‌ను ఖరారు చేసుకోవడం విశేషం. ఈ విజయంతో అమెరికా ఫుట్‌బాల్ చరిత్రలో 96 ఏళ్ల నాటి సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. 1929 ప్రపంచకప్ తర్వాత, అమెరికా జట్టు ఒకే ప్రపంచకప్‌లో మొదటి రెండు మ్యాచ్‌ల్లో వరుసగా విజయాలు సాధించడం ఇదే తొలిసారి కావడం విశేషం. సొంతగడ్డపై అభిమాన సందోహం మధ్య బరిలోకి దిగిన అమెరికా జట్టు ఆట ప్రారంభమైన మొదటి నిమిషం నుంచే ఆస్ట్రేలియాపై ఒత్తిడి పెంచింది. తమ మొదటి మ్యాచ్‌లో పరాగ్వేను 4-1తో చిత్తు చేసిన ఉత్సాహంతో ఉన్న అమెరికా ఆటగాళ్లు ఆస్ట్రేలియాపై ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. మ్యాచ్ ప్రారంభమైన కేవలం 11వ నిమిషంలోనే అమెరికాకు ఊహించని అదృష్టం కలిసివచ్చింది. అమెరికా స్టార్ ఆటగాడు ఫోలారిన్ బాలోగన్ ఆస్ట్రేలియా డిఫెండర్స్‌ను దాటుకొని బంతిని పెనాల్టీ ఏరియాలోకి తీసుకువెళ్లాడు. అక్కడి నుంచి అతను గోల్ పోస్ట్ వైపు కొట్టిన బాల్‌ను అడ్డుకునే క్రమంలో ఆస్ట్రేలియా డిఫెండర్ కేమరాన్ బర్గెస్ పొరపాటు చేశాడు. బంతిని ప్రమాదవశాత్తూ తన సొంత గోల్ పోస్ట్‌లోకి నెట్టేశాడు. దీనితో అమెరికాకు ఖాతాలో ఒక గోల్ పడింది. యూఎస్‌కు 1-0 ఆధిక్యం లభించింది. ఆ తర్వాత ఆస్ట్రేలియా కోలుకోవడానికి ప్రయత్నించినప్పటికీ, అమెరికా మిడ్‌ఫీల్డర్లు, డిఫెండర్లు ప్రత్యర్థి వ్యూహాలను సమర్థవంతంగా తిప్పికొట్టారు. బంతిపై ఎక్కువ సమయం పట్టు సాధించినప్పటికీ, ఆస్ట్రేలియా జట్టు అమెరికా రక్షణ వలయాన్ని ఛేదించలేకపోయింది. ఫస్టాఫ్ ముగియడానికి కొన్ని నిమిషాల ముందు అమెరికా తన రెండో గోల్‌ను నమోదు చేసింది. దీంతో మొదటి సగం ముగిసేసరికే అమెరికా 2-0తో తిరుగులేని ఆధిక్యంలోకి దూసుకెళ్లి ఆస్ట్రేలియాను కోలుకోలేని దెబ్బతీసింది.ఇక సెకండాఫ్‌లో అమెరికా జట్టు దూకుడు కంటే డిఫెన్స్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చింది. మ్యాచ్‌ను పూర్తిగా తమ నియంత్రణలో ఉంచుకుంటూ, ఆస్ట్రేలియాకు ఎలాంటి గోల్ చేసే అవకాశం ఇవ్వకుండా జాగ్రత్త పడింది. ఆస్ట్రేలియా మ్యాచ్‌లోకి తిరిగి రావడానికి శతవిధాలా ప్రయత్నించినప్పటికీ, కనీసం ఒక్క గోల్ కూడా సాధించలేకపోయింది. నిర్ణీత సమయం ముగిసేసరికి అమెరికా 2-0తో విజయాన్ని ఖాయం చేసుకుంది. ఈ ఓటమితో ఆస్ట్రేలియా పాయింట్ల పట్టికలో 3 పాయింట్లతో రెండో స్థానంలోనే నిలిచింది. మరోవైపు ఫిఫా ప్రపంచకప్ 2026లో మొరాకో మిడ్‌ఫీల్డర్ ఇస్మాయిల్ సైబారీ సంచలనం సృష్టించాడు. శుక్రవారం జరిగిన గ్రూప్ దశ ఉత్కంఠ పోరులో స్కాట్లాండ్‌పై మ్యాచ్ ప్రారంభమైన కేవలం 70 సెకన్లలోనే సైబారీ అద్భుత గోల్ సాధించాడు. 2026 ఎడిషన్ ప్రపంచకప్‌లో నమోదైన అత్యంత వేగవంతమైన గోల్‌గా ఇది రికార్డు సృష్టించింది. అలాగే ఈ మ్యాచ్?లో 1-0 తేడాతో మొరాకో విజయం సాధించింది. ఇంతకుముందు సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో చెకియా దేశానికి చెందిన మిచల్ సాడిలెక్ 5 నిమిషాల 7 సెకన్లలో కొట్టిన గోల్ పేరిట ఉన్న రికార్డును సైబారీ ఇప్పుడు బద్దలు కొట్టాడు. మ్యాచ్ ప్రారంభమైన వెంటనే స్కాట్లాండ్ రక్షణ శ్రేణిని ఛేధించి సైబారీ మెరుపు వేగంతో సాధించిన ఈ గోల్‌తో సైబారీ మరో అరుదైన మైలురాయిని చేరుకున్నాడు. తన కెరీర్‌లో ఆడిన మొదటి రెండు ఫిఫా ప్రపంచకప్ మ్యాచ్‌ల్లోనూ వరుసగా గోల్స్ సాధించిన రెండో ఆఫ్రికన్ ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఇంతకుముందు ఈ ఘనతను ఈజిప్ట్ ఫుట్‌బాల్ లెజెండ్ మొహమ్మద్ సలాహ్ మాత్రమే సాధించగా, ఇప్పుడు సైబారీ ఆ క్లబ్‌లో చేరాడు. ప్రపంచకప్ చరిత్రలో మొరాకో దేశం తరఫున నమోదైన అత్యంత వేగవంతమైన గోల్ ఇదే కావడం విశేషం. అలాగే ఆఫ్రికా ఖండం మొత్తం మీద ఇది రెండో అత్యంత వేగవంతమైన గోల్. ఈ జాబితాలో ఘనా ఆటగాడు అసామోవా గ్యాన్ (2006లో చెక్ రిపబ్లిక్‌పై కొట్టిన గోల్) మొదటి స్థానంలో ఉన్నాడు. అయితే ప్రపంచకప్ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన గోల్ రికార్డు మాత్రం తుర్కియే చెందిన హకాన్ సుకుర్ (2002లో సౌత్ కొరియాపై 11 సెకన్లలో కొట్టిన గోల్) పేరిట చెక్కుచెదరకుండా ఉంది.

# రోహిత్ శర్మ సహకారంతోనే సెంచరీ

## • టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్



రోహిత్ శర్మ సహకారంతోనే సెంచరీ చేయగలిగానని టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ అన్నాడు. బ్యాటింగ్ చేస్తున్నంత సేపు ప్రశ్నలతో విసిగించానని, రోహిత్ భయ్యా ఓపికగా తనకు సూచనలు ఇచ్చాడని తెలిపాడు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా అఫ్గానిస్థాన్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో యశస్వి జైస్వాల్(86 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్స్‌లతో 110 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగాడు. దాంతో ఈ మ్యాచ్‌లో టీమిండియా 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ గెలుపుతో మూడు వన్డేల సిరీస్‌ను 3-0తో టీమిండియా క్లీన్ స్వీప్ చేసింది. ఈ మ్యాచ్ అనంతరం తన ఇన్నింగ్స్ గురించి మాట్లాడిన యశస్వి జైస్వాల్.. రోహిత్ శర్మ సూచనలతోనే ఈ శతకం సాధ్యమైందని చెప్పాడు.ఈ ఇన్నింగ్స్‌ను తాను ఎంతగానో ఆస్వాదించానని వెల్లడించాడు. 'ఈ ఇన్నింగ్స్‌ను నేను చాలా ఆస్వాదించాను. పవర్‌ప్లేలోనే నాకు కొన్ని పరుగులు వచ్చాయి. దాంతో ఆ జోరును కొనసాగిస్తూ చివరి వరకు క్రీజులో ఉండాలనుకున్నాను. అందుకే ఈ ఇన్నింగ్స్‌ను చాలా ఎంజాయ్ చేశాను. నేను నా విధానంపై, నా నియంత్రణలో ఉన్న విషయంపై మాత్రమే ఫోకస్ పెడుతాను. నా సాయశక్తులా కష్టపడటానికి ప్రయత్నిస్తాను. మా సపోర్ట్ స్టాఫ్ నుంచి కూడా నాకు మద్దతు లభిస్తుంది. సపోర్ట్ స్టాఫ్‌తో నా కమ్యూనికేషన్ చాలా బాగుంటుంది. కాబట్టి ఏం జరుగుతుందో నాకు స్పష్టంగా తెలుస్తుంది. అందుకే నేను ఈ ఇన్నింగ్స్‌ను బాగా ఆస్వాదించాను. నాకు లభించిన మంచి ఆరంభాలను శతకాలుగా మల్చడం అదృష్టమనే చెప్పాలి. నాకు మంచి ఆరంభం లభిస్తే దాన్ని భారీ స్కోరుగా మార్చడానికే ప్రయత్నిస్తున్నాను. ఎందుకంటే స్పోర్ట్స్ , ముఖ్యంగా క్రికెట్‌లో మనకు కలిసి వచ్చిన రోజును పూర్తిగా ఉపయోగించుకోవాలి. నేను అదే చేయడానికి ప్రయత్నిస్తాను. ఎందుకంటే ఇటీవల నాకు ఒక అనుభవం ఎదురైంది.. నేను ఎంత ప్రయత్నించినా విషయాలు నాకు అనుకూలంగా జరగలేదు. కానీ ఈరోజు మాత్రం నేను చాలా పట్టుదలగా ఉన్నాను. ఎలాగైనా నా దృష్టిని కోల్పోకూడదని, స్ట్రైక్ రొటేట్ చేస్తూనే ఉండాలని అనుకున్నాను. క్రీజులో సెట్ అయిన తర్వాత, దాన్ని భారీ స్కోరుగా మార్చాలనుకున్నాను. రోహిత్ భయ్యా ఎల్లప్పుడూ నాకు సహాయం చేస్తారు. నేను ఆయనను ఎప్పుడూ చాలా ప్రశ్నలు అడుగుతుంటాను. ఆయన సూచనలను మ్యాచ్‌లో అమలు చేయడానికి ప్రయత్నిస్తాను. ఈరోజు కూడా నేను కొన్ని డాట్ బాల్స్ ఆడినప్పుడు.. 'ఇప్పుడు నేను ఏం చేయాలి?' అని ఆయనను అడిగాను.

# వన్డే క్రికెట్ చరిత్రలోనే టీమిండియా సరికొత్త రికార్డు



చెన్నై వేదికగా అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన మూడో వన్డేలో భారత్ వన్డే క్రికెట్ చరిత్రలోనే సరికొత్త రికార్డు సృష్టించింది. అఫ్ఘాన్ కెప్టెన్ హష్మతుల్లా షాహిదీ పిచ్‌పై పదే పదే పరుగెత్తడంతో అంపైర్లు 5 పరుగుల పెనాల్టీ విధించారు. దీంతో 5/0తో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్, తొలి ఓవర్లోనే యశస్వి జైశ్వాల్ బౌండరీల వర్షం కురిపించడంతో ఏకంగా 23 పరుగులు రాబట్టింది. ఫలితంగా 2004లో బంగ్లాదేశ్‌పై నమోదైన 22 పరుగుల రికార్డును టీమిండియా బద్దలు కొట్టింది. శనివారం చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో ఆఫ్ఘానిస్థాన్‌తో జరిగిన మూడో వన్డేలో, భారత్ ఓ అరుదైన రికార్డు సాధించింది. 219 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా.. తొలి ఓవర్‌లోనే ఎదురుదాడికి దిగింది. ఏకంగా రికార్డు స్థాయిలో తొలి ఆరు బంతుల్లో 23 రన్స్ రాబట్టింది. దీంతో వన్డే క్రికెట్ చరిత్రలో తమ అత్యధిక తొలి ఓవర్ స్కోరు నమోదు చేసింది.ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్ఘానిస్థాన్ 219 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం రోహిత్ శర్మ, యశస్వి జైశ్వాల్ భారత ఇన్నింగ్స్‌ను ప్రారంభించారు. అయితే అఫ్ఘాన్ బ్యాటింగ్ చేస్తుండగా.. ఆ జట్టు కెప్టెన్ హష్మతుల్లా షాహిదీ పదే పదే పిచ్‌లోని సురక్షిత ప్రాంతంలోకి పరుగెత్తాడు. దీంతో అంపైర్లు.. ఆ జట్టుకు 5 రన్స్ పెనాల్టీగా విధించారు. దీంతో టీమిండియా 5/0 స్కోరుతో తమ ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. ఇక భారత బ్యాటర్లు మరో 18 రన్స్ చేయడంతో 22 ఏళ్ల తర్వాత వన్డే క్రికెట్‌లో ఓ ఓవర్‌లో తమ అత్యధిక స్కోరును టీమిండియా నమోదు చేసింది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక





# గతాన్ని పూర్తిగా మర్చిపోవాలి

: శోభిత ధూళిపాళ

అక్కినేని నాగచైతన్యతో వివాహం జరిగిన తర్వాత సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చిన శోభిత ధూళిపాళ.. రీసెంట్‌గా 'చీకటిలో' వెబ్‌సిరీస్‌తో డిజిటల్ స్క్రీన్‌పై మంచి థ్రిల్ ఇచ్చారు. ప్రస్తుతం కోలీవుడ్ క్రేజీ డైరెక్టర్ పా రంజిత్ తెరకెక్కిస్తున్న సైన్స్ ఫిక్షన్ డ్రామా 'వెట్టువం' షూటింగ్‌తో బిజీగా ఉన్న ఈ బ్యూటీ... తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో చేసిన కొన్ని పర్సనల్ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతమైన చర్చకు దారితీశాయి.ఇంటర్వ్యూలో భాగంగా యాంకర్ శోభితను ఒక పర్సనల్ క్వశ్చన్ అడిగారు. "మీ లైఫ్‌లో ఏ విషయాన్ని పూర్తిగా మర్చిపోవాలని అనుకుంటున్నారు?" అని ప్రశ్నించగా... దానికి శోభిత ఏమాత్రం తడబడకుండా.. "నిన్నటి వరకు నా జీవితంలో జరిగిన ప్రతి సంఘటనను, జ్ఞాపకాన్ని పూర్తిగా మర్చిపోవాలని అనుకుంటున్నాను" అని ఆన్సర్ ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు.తన సమాధానానికి గల కారణాన్ని వివరిస్తూ.. "సాధారణంగా లోకం మతిమరుపును ఒక జబ్బుగా చూస్తుంది. కానీ నా దృష్టిలో కొన్నిసార్లు మతిమరుపు అనేది మనిషికి దొరికే ఒక గొప్ప వరం. ఎందుకంటే లైఫ్‌లో వేరే వాళ్లు మన పట్ల చేసిన బాధాకరమైన పనులు, మన మనసును గాయపరిచిన చేదు జ్ఞాపకాలను మనం మర్చిపోయినప్పుడే జీవితంలో ఫ్రీగా ముందుకు సాగడం సాధ్యమవుతుంది" అని చెప్పుకొచ్చారు. పాత జ్ఞాపకాలలోనే ఎప్పుడూ కూరుకుపోకుండా, వాటన్నింటినీ డిలీట్ చేసేసి రేపటి భవిష్యత్తు గురించి పాజిటివ్‌గా ఆలోచించడమే నేటి అవసరమని శోభిత క్లారిటీ ఇచ్చారు.

# ఇదిగో మా క్లీంకార..

## తొలిసారి కుమార్తెను చూపించిన రామ్ చరణ్, ఉపాసన...



మెగా అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న క్షణం ఎట్టకేలకు వచ్చింది. రామ్ చరణ్, ఉపాసన దంపతులు తమ కుమార్తె క్లీంకార ముఖాన్ని తొలిసారి ప్రపంచానికి చూపించారు. ఆమె పుట్టిన రోజు సందర్భంగా ఉపాసన తన సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటో ఇప్పుడు వైరల్‌గా మారింది. ఇప్పటివరకు కూతురు ముఖం కనిపించకుండా జాగ్రత్తపడిన ఈ జంట మూడో బర్త్‌డే రోజున అభిమానులకు ప్రత్యేక కానుక ఇచ్చింది."మా అమూల్యమైన చిన్నారి క్లీంకారకు పుట్టినరోజు శుభాకాంక్షలు" అంటూ ఉపాసన తన ఫేస్‌బుక్ ఖాతాలో అందమైన తమ ఫ్యామిలీ ఫొటోను పంచుకున్నారు. పచ్చని ప్రకృతి మధ్యలో రామ్ చరణ్, ఉపాసన తమ గారాల పట్టిని ప్రేమగా ఎత్తుకుని ఉన్న ఈ చిత్రం అభిమానులను ఆకట్టుకుంటోంది. నీలి రంగు దుస్తుల్లో చిరునవ్వులు చిందిస్తున్న చిన్నారి అందరి చూపును కట్టిపడేస్తోంది. బుగ్గల నిండా నవ్వు, కళ్లలో అమాయకత్వం, ముఖంలో మెరిసే ఆనందం ఫొటోకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తల్లిదండ్రుల ఒడిలో హాయిగా కూర్చుని నవ్వుతున్న మెగా వారసురాలు ఆ కుటుంబ చిత్రానికి మరింత అందాన్ని తీసుకొచ్చింది. కొందరు ఆమె కళ్లు తాత మెగాస్టార్ చిరంజీవి కళ్లలా ఉన్నాయని కామెంట్ చేస్తున్నారు.ఈ పోస్ట్ బయటకు వచ్చిన వెంటనే సోషల్ మీడియాలో శుభాకాంక్షల వెల్లువ మొదలైంది. మెగా అభిమానులతో పాటు సినీ ప్రముఖులు క్లీంకారకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. మూడేళ్లుగా అభిమానులు ఎదురుచూస్తున్న ఆమె ఫేస్ రివీల్ కావడంతో ఈ ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

# సూర్య 'విశ్వనాథ్ అండ్ సన్స్'

## నుంచి రొమాంటిక్ మెలోడీ విడుదల



విలక్షణ నటుడు సూర్య కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' ప్రచార కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా చిత్రబృందం శుక్రవారం నాడు ఈ సినిమాలోని తొలి గీతాన్ని విడుదల చేసింది. తమిళంలో 'పట్టాంపూచి'గా, తెలుగులో 'నేనో బటర్ ఫ్లై' పేరుతో విడుదలైన ఈ రొమాంటిక్ మెలోడీకి సంగీత ప్రియుల నుంచి విశేష స్పందన లభిస్తోంది.జీవీ ప్రకాశ్ కుమార్ స్వరపరిచిన ఈ గీతాన్ని సుబ్లాషిణి ఆలపించారు. హీరో సూర్య, కథానాయిక మమిత బైజుల మధ్య కెమిస్ట్రీని ప్రతిబింబిస్తూ సాగే ఈ పాటను ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదల చేశారు. లిరికల్ వీడియోలోని సీతాకోకచిలుక థీమ్ విజువల్స్ వీక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ గీతం ప్రస్తుతం సోషల్ మీడియా, యూట్యూబ్ వేదికలపై ట్రెండింగ్‌లో ఉంది.వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సూర్య 40 ఏళ్ల అంతర్జాతీయ పిస్టల్ షూటర్ సంజయ్ విశ్వనాథ్ పాత్రలో కనిపించనున్నారు. కుటుంబ భావోద్వేగాల నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్ర డిజిటల్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ కైవసం చేసుకుంది. స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఈ ఏడాది ఆగస్టు 14న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# 'మా ఇంటి బంగారం'కు మంచి ఓపెనింగ్స్..

## మహిళా ప్రేక్షకులకు సమంత థ్యాంక్స్

సమంత ప్రధాన పాత్రలో నటించి, స్వయంగా నిర్మించిన చిత్రం 'మా ఇంటి బంగారం'. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన ఆరంభాన్ని అందుకుంది. విడుదలైన తొలిరోజే ప్రపంచవ్యాప్తంగా రూ. 13.15 కోట్ల గ్రాస్ వసూలు చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ భారీ విజయం పట్ల సమంత ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యంగా సినిమా ఓపెనింగ్స్‌కు మహిళా ప్రేక్షకులు భారీగా తరలిరావడంపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు.ఈ విజయంపై ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ఒక నోట్ రాశారు. "మొదటి రోజు ఒక సినిమాకు ఇంత మంచి ఓపెనింగ్ రావడం చాలా ఆనందంగా ఉంది. యువత నుంచి పెద్దల వరకు అందరూ సినిమాను ఆశీర్వదించడానికి రావడం గొప్ప అనుభూతినిచ్చింది" అని ఆమె పేర్కొన్నారు."థియేటర్లకు ఓపెనింగ్స్‌ను మగ ప్రేక్షకులే తెస్తారని చాలాకాలంగా వింటున్నాం. కానీ, ఈ సినిమాకు మహిళలు భారీగా తరలిరావడం చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. సినిమా ప్రేక్షకులు కూడా ఎదుగుతున్నారని అర్థమవుతోంది. మా చిన్న ప్రొడక్షన్ హౌస్ విజయం సాధించింది" అంటూ తన సంతోషాన్ని పంచుకున్నారు. ఇటీవలే ఓ ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ.. 'మా ఇంటి బంగారం'లోని స్వర్ణ పాత్ర తన నిజ జీవితానికి చాలా దగ్గరగా ఉంటుందని సమంత తెలిపారు. తాను ఇప్పటివరకు చేసిన తెలుగు పాత్రలన్నింటిలో ఇదే తనకు అత్యంత ఇష్టమైనదని చెప్పారు. చిత్రంలోని యాక్షన్ సన్నివేశాల గురించి మాట్లాడుతూ.. "సినిమాలో స్లో మోషన్ షాట్లు, బిల్డప్ షాట్లు ఉండవు. నిజమైన పంచ్‌లు ఉంటాయి. నాకు కూడా దెబ్బలు తగిలాయి, రక్తం వచ్చింది. అన్ని యాక్షన్ సీన్లను నేనే స్వయంగా చేశాను. అందుకే అవి అంత సహజంగా కనిపిస్తున్నాయి" అని సమంత వెల్లడించారు.






# పవన్ కల్యాణ్ స్ఫూర్తితోనే

## బాలుడి ప్రాణం కాపాడేందుకు బండ్ల గణేశ్ 5 లక్షల సాయం..

సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ తనలోని ఉదారత్వాన్ని చాటుకుంటూ ఒక గొప్ప నిర్ణయంతో వార్తల్లో నిలిచారు. ప్రాణాంతక వ్యాధితో పోరాడుతున్న హనుమకొండకు చెందిన చిన్నారి నిరంజన్ కుటుంబానికి తాను ప్రకటించిన రూ. 5 లక్షల ఆర్థిక సాయాన్ని ఈరోజు తన చేతుల మీదుగా అందజేశారు.
హనుమకొండలోని హనుమాన్ నగర్‌లో ఉన్న చిన్నారి నిరంజన్ నివాసానికి బండ్ల గణేశ్ స్వయంగా వెళ్లారు. నిరంజన్‌తో కాసేపు ముచ్చటించి, ధైర్యం చెప్పారు. అతని ఆరోగ్య పరిస్థితిపై తల్లిదండ్రులు రాంగోపాల్ చారి, మానసలతో మాట్లాడి... తమ పరమేశ్వర ఆర్ట్స్ ప్రొడక్షన్ బ్యానర్ తరఫున రూ. 5 లక్షల చెక్‌ను వారికి అందజేశారు. ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.
ఈ సందర్భంగా బండ్ల గణేశ్ మీడియాతో మాట్లాడుతూ... "నేను పవన్ కల్యాణ్ గారి భక్తుడిని. దైవసమానులైన పవన్ కల్యాణ్ గారు ఈ బాబును పరామర్శించినప్పుడే నిరంజన్ విషయం నా దృష్టికి వచ్చింది. ఆయన స్ఫూర్తితోనే నేను ఈ రోజు ఇక్కడికి వచ్చి ఆర్థిక సాయం చేశాను. నిజానికి మేమంతా ఈ స్థాయిలో ఉన్నామంటే దానికి పవన్ కల్యాణ్ గారి దయే కారణం" అంటూ తన 'బాస్'పై ఉన్న భక్తిని చాటుకున్నారు.ప్రస్తుతం తన కూతురి వివాహ పనులతో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ, ఈ రోజే వచ్చి సాయం చేయాలని ఫిక్స్ అయినట్లు బండ్ల గణేశ్ చెప్పారు. "నారా భువనేశ్వరి గారి పుట్టినరోజు సందర్భంగా ఈ రోజు ఈ రూ. 5 లక్షల సాయాన్ని నిరంజన్ కుటుంబానికి అందించడం నాకు ఎంతో సంతోషాన్ని ఇస్తోంది. బాబు త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ పవిత్రమైన సందర్భంగా నేను ఎలాంటి రాజకీయాలు మాట్లాడదలుచుకోలేదు" అని స్పష్టం చేశారు.

# మనసుకూ విశ్రాంతి అవసరం..

## సోషల్ మీడియాకు బ్రేక్ ప్రకటించిన హీరోయిన్



ప్రముఖ నటి కయాదు లోహర్ సోషల్ మీడియాకు తాత్కాలికంగా విరామం ఇస్తున్నట్లు ప్రకటించారు. శరీరానికి విశ్రాంతి ఇచ్చినట్లే మనసుకు కూడా విశ్రాంతి అవసరమని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా అభిమానులకు తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా కొంతకాలం విశ్రాంతి తీసుకుని, స్క్రీన్‌కు అవతల ఉన్న నిజ జీవితంతో మమేకం కావాలనుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆమె ఒక సుదీర్ఘ సందేశాన్ని పంచుకున్నారు. "సోషల్ మీడియా నుంచి చిన్న అడుగు వెనక్కి వేస్తున్నాను. కొన్నిసార్లు మనం శరీరానికి ఇచ్చే విశ్రాంతి మనసుకు కూడా అవసరం. నేను కాస్త నెమ్మదించి, డిస్‌కనెక్ట్ అవ్వాలని, స్క్రీన్‌కు అవతల ఉన్న జీవితంతో, నాతో నేను ఎక్కువ సమయం గడపాలని భావిస్తున్నాను" అని ఆమె తన పోస్ట్‌లో రాశారు.
"నాకు మద్దతుగా నిలిచిన, ప్రోత్సహించిన, దయ చూపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మీ ప్రేమ, సందేశాలు నాకు ఎంతో విలువైనవి. నేను కొంతకాలం సోషల్ మీడియాకు దూరంగా ఉంటాను, కానీ ఏవైనా ముఖ్యమైన అప్‌డేట్స్ ఉంటే నా టీమ్ ఈ ఖాతా ద్వారా పంచుకుంటుంది. అందరూ శాంతి, సంతోషం, దయతో ఉండాలని కోరుకుంటున్నాను. త్వరలో కలుద్దాం" అని ఆమె వివరించారు.కేవలం గత నెలలోనే కయాదు తన తమ్ముడు ఉదయ్ పుట్టినరోజు సందర్భంగా ఒక అందమైన పోస్ట్ చేశారు. "నువ్వు ఎంత పెరిగినా, నా దృష్టిలో ఎప్పటికీ చిన్నపిల్లవాడివే. జీవితంలో ఏదైనా కాకముందు, నేను మొదట అక్కనయ్యాను" అని ఆమె పేర్కొన్నారు. "నిన్ను తప్ప నా తమ్ముడిని ఎవరూ ఇబ్బంది పెట్టడానికి వీల్లేదు" అని సరదాగా రాసుకొచ్చారు.

# ఏఐ డీప్‌ఫేక్‌తో వేధింపులు..

## కాంతార హీరోయిన్ కేసులో కీలక పురోగతి



'కాంతార చాప్టర్ 1' చిత్రంతో గుర్తింపు పొందిన నటి రుక్మిణి వసంత్‌కు సంబంధించిన డీప్‌ఫేక్ కేసులో కర్ణాటక సైబర్ క్రైమ్ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను ఉపయోగించి నటి అశ్లీల చిత్రాలు, వీడియోలను సృష్టించి సోషల్ మీడియాలో ప్రచారం చేశారనే ఆరోపణలపై ఈ అరెస్టులు జరిగాయి.నిందితులను బాగల్‌కోట్ జిల్లాకు చెందిన రవికుమార్ (24), బెంగళూరు కామాక్షిపాళ్యకు చెందిన చంద్రకాంత్ (33), నాగసంద్రకు చెందిన రంజిత్ (25)గా పోలీసులు గుర్తించారు. ఐటీ చట్టంతో పాటు భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్ల కింద వీరిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు శుక్రవారం వెల్లడించారు.గత మే నెలలో రుక్మిణి వసంత్ బికినీ ధరించినట్లుగా ఏఐ సాంకేతికతతో సృష్టించిన కొన్ని నకిలీ చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తన ముఖాన్ని వేరొకరి శరీరానికి అతికించి, ప్రతిష్టకు భంగం కలిగించేలా ఈ ఫోటోలను సృష్టించారని రుక్మిణి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అటువంటి నకిలీ కంటెంట్‌ను షేర్ చేయవద్దని ఆమె ఈ సందర్భంగా తన అభిమానులను కోరారు.నటి ఫిర్యాదుతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, ఈ కంటెంట్‌ను సర్క్యులేట్ చేసిన 29 సోషల్ మీడియా ఖాతాలపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ క్రమంలోనే తాజాగా ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి కేసులో పురోగతి సాధించారు. ప్రముఖులను లక్ష్యంగా చేసుకుని, ఏఐ సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ ఇలాంటి అశ్లీల కంటెంట్ సృష్టించడంపై పౌర సమాజంలో మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613